

## అమ్మాయిలదీ అదే కథ

హాకీ ప్రనపంచకప్‌లో భారత మహిళల జట్టు ప్రస్థానం ముగిసింది. నెదర్లాండ్స్ చేతిలో పురుషుల జట్టు ఓటమి బాధ మరువక ముందే అమ్మాయిల పోరాటమూ రెండో దశలోనే ఆగిపోయింది. పూల్ 'ఈ'లో భాగంగా ఆడిన మూడు మ్యాచుల్లో రెండు డ్రా చేసుకుని ఒకదాంట్లో ఓడిన సలీమ సేన.. ఆదివారం ఆస్ట్రేలియాతో గేమ్‌నూ డ్రాగానే ముగించింది. ఈ మ్యాచ్‌లో గెలిచి సెమీస్‌కు చేరాలన్న 52 ఏండ్ల నిరీక్షణకు తెరదించాలని యత్నించిన భారత్‌కు మరోసారి నిరాశే ఎదురవగా ఆస్ట్రేలియా సెమీస్‌కు అర్హత సాధించింది. మ్యాచ్‌లో పలుమార్లు పెనాల్టీ కార్నర్‌లు లభించినా వాటిని గోల్స్‌గా మలచడంలో రెండు జట్లూ విఫలమయ్యాయి. ఇదిలాఉండగా ఇప్పటికే సెమీస్ ఆశలు గల్లంతైన వేళ భారత పురుషుల జట్టు నేడు అర్జెంటీనాతో కీలక మ్యాచ్ ఆడనుంది. ఈ టోర్నీ సెమీస్ రేసులో నిలవాలంటే ఇతర సమీకరణాలకు తోడు హర్మన్‌ప్రీత్ సేన ఈ మ్యాచ్‌లో భారీ గోల్స్ తేడాతో విజయం సాధించాల్సి ఉంది.


నిజామాబాద్
సోమవారం
24.08.2026

సంపుటి : 16 సంచిక: 328
పేజీలు: 6 వెల: రూ.5

ఎడిటర్ : సిరిగాద ప్రసాద్

చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక


# కాంగ్రెస్ అధ్యక్షుడితో కొండా సురేఖ భేటీ

- బెంగళూరులో ఖర్గేతో కొండా సురేఖ భేటీ
- కూతురి వ్యాఖ్యలపై నేరుగా ప్రశ్నలు
- పార్టీకి నష్టం కలిగించేలా మాట్లాడొద్దని సూచన
- ఖర్గేకు ఘటనపై వివరణ ఇచ్చిన మంత్రి

**చట్టం, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో హఠాత్తుగా సమావేశమయ్యారు. బెంగళూరులో జరిగిన ఈ భేటీ సుమారు 15 నిమిషాల పాటు సాగింది. ఇటీవల తన కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు, ఆ తర్వాత చోటుచేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది.



**కూతురి వ్యాఖ్యలపై ఖర్గే ఆరా**

ఇటీవల కొండా సురేఖ కుమార్తె చేసిన కొన్ని వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై మల్లికార్జున ఖర్గే నేరుగా ఆరా తీశారు. పార్టీకి నష్టం కలిగించేలా మాట్లాడటం ఎంతమాత్రం సరికాదని ఖర్గే మంత్రికి స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. క్రమశిక్షణ తప్పకుండా చూసుకోవాలని, బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.

**ఘటనపై వివరణ ఇచ్చిన కొండా సురేఖ**

ఖర్గే లేవనెత్తిన ప్రశ్నలకు మంత్రి కొండా సురేఖ సుదీర్ఘంగా వివరణ ఇచ్చారు. అసలు ఏం జరిగింది, ఆ వ్యాఖ్యల వెనుక ఉన్న ఉద్దేశం ఏంటి, ఆ తర్వాత చోటుచేసుకున్న వరుస పరిణామాలను ఆయనకు వివరించారు. రాష్ట్రానికి చెందిన కొందరు ముఖ్య నేతల అపాయింట్‌మెంట్ కోరినప్పటికీ వారు సమయం ఇవ్వకపోవడంతోనే, విషయం తీవ్రతను వివరించేందుకు నేరుగా ఏఐసీసీ అధ్యక్షుడిని కలవాల్సి వచ్చిందని సురేఖ తెలిపినట్లు సమాచారం.

# రైస్ మిల్స్‌లో ఏం జరుగుతోంది?

- 28 మంది కమాండోలు రంగంలోకి..
- రైస్ మిల్లర్లపై మెరుపు తనిఖీలు
- రూ.40 వేల కోట్ల ధాన్యం సేకరణ
- 154 లక్షల టన్నుల ధాన్యం
- డిఫాల్ట్ మిల్లర్లపై క్రిమినల్ కేసులు
- అక్రమాలకు జీరో టాలరెన్స్



**చట్టం, స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో రైస్ మిల్లర్లపై ప్రభుత్వం కొత్త తరహా ఆపరేషన్‌కు సిద్ధమైంది. ప్రభుత్వ ధాన్యం మిల్లింగ్ చేసి, నిర్ణీత పరిమాణంలో బియ్యం తిరిగి అప్పగించాల్సిన బాధ్యత ఉన్న కొందరు మిల్లర్లు నిబంధనలు పాటించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ధాన్యం రీసైక్లింగ్, మార్కెట్‌కు తరలింపు, గడువు దాటినా బియ్యం ఇవ్వకపోవడం వంటి వ్యవహారాలతో ప్రభుత్వానికి భారీ నష్టం వస్తోందని అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో పౌరసరఫరాల శాఖ తన ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవస్థను మరింత బలోపేతం చేసింది. పోలీస్ విభాగంలోని గ్రేహౌండ్స్, ఆక్టోపస్ నుంచి ఎంపికైన 28 మంది శిక్షణ పొందిన సిబ్బందిని ప్రత్యేకంగా రంగంలోకి దింపుతోంది. మిల్లుల్లో ఆకస్మిక తనిఖీలు, రికార్డుల పరిశీలన, నిల్వల తనిఖీ, అక్రమాల గుర్తింపుపై ఈ బృందాలు దృష్టి పెట్టనున్నాయి. ప్రభుత్వ ధాన్యం విషయంలో ఇకపై చిన్న తప్పిదాన్ని కూడా తేలిగ్గా తీసుకోకూడదన్న స్పష్టమైన సంకేతం తాజా నిర్ణయంతో కనిపిస్తోంది. ప్రజాధనం కాపాడటమే ప్రధాన లక్ష్యంగా నిరంతరం చర్యలు వేగం పుంజుకున్నాయి. మిల్లర్లపై నిఘా పెంచడంతో ప్రభుత్వ ధాన్యం లెక్కలు మరింత స్పష్టంగా మారనున్నాయి. రైతుల నుంచి ప్రభుత్వం కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసే ధాన్యం మిల్లులకు చేరుతుంది. మిల్లింగ్ పూర్తయ్యాక నిర్ణీత ప్రమాణాల ప్రకారం బియ్యాన్ని ప్రభుత్వ నిల్వలకు అప్పగించాలి. ఈ ప్రక్రియలో మిల్లర్లు కీలక పాత్ర పోషిస్తారు. అయితే కొందరు మిల్లర్లు ప్రభుత్వానికి చేరాల్సిన ధాన్యాన్ని ఇతర అవసరాలకు మళ్లిస్తున్నారన్న ఫిర్యాదులు పెరిగాయి. ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 202526లో ప్రభుత్వం దాదాపు రూ.40 వేల కోట్లు ఖర్చు చేసి 154 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించింది. ఇంత పెద్ద మొత్తంలో ధాన్యం సేకరించిన నేపథ్యంలో ఒక్క క్వింటాల్ కూడా లెక్క తప్పకుండా చూడాల్సిన అవసరం ఏర్పడింది. మిల్లుల వద్ద ఉన్న స్టాక్, మిల్లింగ్ వివరాలు, ప్రభుత్వానికి ఇచ్చిన బియ్యం పరిమాణం, మిగిలిన నిల్వలను అధికారులు సరిపోల్చనున్నారు. తేడాలు బయటపడితే బాధ్యులపై కేసులు పెట్టే అవకాశాలు ఉన్నాయి. దీంతో అక్రమాలకు పాల్పడే మిల్లర్లలో ఇప్పుడు ఆందోళన మొదలైంది. ప్రభుత్వ ఆస్తుల విషయంలో కఠిన వైఖరి స్పష్టమైంది. ప్రతి దశలో లెక్కలు పక్కాగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోనున్నారు. మిల్లర్ల తనిఖీల కోసం రంగంలోకి దిగుతున్న 28 మంది సిబ్బంది సాధారణ తనిఖీ బృందాలు కాదు. గ్రేహౌండ్స్, ఆక్టోపస్ వంటి ప్రత్యేక పోలీస్ విభాగాల్లో పనిచేసిన అనుభవం ఉన్నవారిని ఎంపిక చేశారు. ఆకస్మిక ఆపరేషన్లు, వేగంగా స్పందించడం, అనుమానాస్పద ప్రదేశాలను తనిఖీ చేయడం వంటి నైపుణ్యాలు వీరికి ఉన్నాయి. పౌరసరఫరాల శాఖలోని పనితీరు మాత్రం కొత్త కావడంతో తెలంగాణ పోలీస్ అకాడమీలో మూడు రోజుల ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. నిత్యావసర సరుకుల చట్టం, పౌరసరఫరాల నిబంధనలు, తనిఖీ విధానాలు, కేసుల నమోదు పద్ధతులపై అవగాహన కల్పించారు. ఇక నుంచి వీరు ప్రత్యేక టాస్క్ టీమ్‌లుగా పనిచేస్తారు. ముందస్తు సమాచారం లేకుండానే మిల్లులను తనిఖీ చేసే అవకాశం ఉంటుంది. రికార్డుల్లో ఉన్న ధాన్యం, గోదాముల్లో కనిపించే ధాన్యం మధ్య తేడా ఉందా అనే అంశాన్ని కూడా పరిశీలిస్తారు. అనుమానాస్పద లావాదేవీలు కనిపిస్తే అక్కడికక్కడే వివరాలు సేకరించనున్నారు. దీంతో మిల్లర్లకు సాధారణ తనిఖీ కంటే ఈ ఆపరేషన్ గట్టి హెచ్చరికగా మారింది. వారి కదలికలపై నిఘా ఉంటుంది కూడా. ధాన్యాన్ని పక్కదారి పట్టించే మిల్లర్లపై జీరో టాలరెన్స్ విధానం అమలు చేస్తామని పౌరసరఫరాల శాఖ స్పష్టం చేసింది. తనిఖీల్లో అక్రమాలు బయటపడితే వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నారు. గతంలో నోటీసులు, గడువులు, వివరణలతో వ్యవహరించిన చోట ఇప్పుడు చర్యలు వేగంగా ఉండే అవకాశం కనిపిస్తోంది. ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యం నిల్వలు సరిగ్గా ఉన్నాయా, లెక్కలు సరిపోతున్నాయా, మిల్లింగ్ నిజంగా జరిగిందా అనే అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నారు. డిఫాల్ట్ అయిన మిల్లులను గుర్తించి ముందుగా తనిఖీలు చేపట్టే అవకాశం ఉంది. అవసరమైతే రికవరీ ప్రక్రియను వేగవంతం చేయనున్నారు. కోట్ల రూపాయల విలువైన ధాన్యం ప్రజల డబ్బుతో కొనుగోలు చేసినదే కాబట్టి దాని విషయంలో నిర్లక్ష్యం ఉండకూడదని ప్రభుత్వం భావిస్తోంది. చర్యలతో అక్రమాలకు పాల్పడే వారికి ఖర్చు మారనుంది. చట్టం ముందు ఎవరైనా సమానమే అన్న సందేశాన్ని శాఖ బలంగా పంపుతోంది. రైతుల ప్రయోజనం, ప్రభుత్వ నిల్వల భద్రత, ప్రజాధన పరిరక్షణ ఈ ఆపరేషన్‌లో కీలకాంశాలుగా మారాయి. మొత్తంగా చూస్తే తెలంగాణలో రైస్ మిల్లర్లపై ప్రభుత్వం చేపట్టిన కమాండో ఆపరేషన్ సాధారణ తనిఖీల కంటే భిన్నమైన చర్యగా నిలుస్తోంది. ప్రత్యేక పోలీస్ బలగాల అనుభవం ఉన్న సిబ్బందిని పౌరసరఫరాల ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు జోడించడం వెనుక ప్రభుత్వ ధాన్యం రక్షణపై ఉన్న ఆందోళన స్పష్టంగా కనిపిస్తోంది. భారీగా ధాన్యం కొనుగోలు చేసిన సమయంలో మిల్లులపై పర్యవేక్షణ పెంచడం అవసరమైంది. ప్రభుత్వానికి బియ్యం అప్పగించకుండా కాలయాపన చేసే వారిపై ఒత్తిడి పెరగనుంది. అక్రమ నిల్వలు, మార్కెట్‌కు మళ్లిన ధాన్యం, నకిలీ రికార్డులపై దృష్టి ఉంటుంది. ఈ చర్యలు నిజాయితీగా పనిచేసే మిల్లర్లకు సమస్య కాకుండా, నిబంధనలు ఉల్లంఘించే వారికే గట్టి దెబ్బగా ఉండాలని శాఖ భావిస్తోంది. సేకరించిన ధాన్యం చివరకు ప్రజలకు ఉపయోగపడే ప్రభుత్వ నిల్వగా మారాలి.

# కేంద్ర ప్రభుత్వ తీరుపై రేవంత్ రెడ్డి ఆగ్రహం

**చట్టం, స్టేట్ బ్యూరో:**

విదేశాంగ శాఖ అనుమతి నిరాకరించడంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ రాజకీయ కక్ష సాధింపు చర్యల వల్ల తన అమెరికా పర్యటన నిలిచిపోయిందని ఆరోపిస్తూ, లండన్ నుంచే నేరుగా హైదరాబాద్‌కు తిరుగుపయనమయ్యారు. ఈ విషయమై సోషల్ మీడియా వేదికగా స్పందించిన ఆయన, కేంద్ర వైఖరిని ఎండగట్టారు. మద్దతుగా నిలిచిన ఖర్గేకు ధన్యవాదాలు.. నేడు హైదరాబాద్‌కు చేరుకోనున్న సీఎం తన విదేశీ పర్యటనకు అనుమతి నిరాకరించడంపై స్పందించి, కేంద్ర వైఖరిని ప్రశ్నిస్తూ తనకు మద్దతుగా నిలిచిన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే దేశవ్యాప్తంగా తన సమస్యపై స్పందించి మద్దతు తెలిపిన పార్టీ నాయకులకు, ప్రజలకు నా కృతజ్ఞతలు అని పేర్కొన్నారు.



**లండన్ టూర్ సక్సెస్.. విదేశీ పర్యటనల రద్దుపై హైదరాబాదులో క్లారిటీ**

గత మూడు రోజులుగా లండన్‌లో నిర్వహించిన అన్ని అధికారిక కార్యక్రమాలు, సమావేశాలు విజయవంతంగా ముగిశాయని రేవంత్ రెడ్డి తెలిపారు. అయితే, విదేశాంగ శాఖ నిర్ణయంతో బోస్టన్ షెడ్యూల్ రద్దు కావడంతో మరికొద్ది గంటల్లోనే హైదరాబాద్‌కు చేరుకోనున్నట్లు వెల్లడించారు. విదేశీ పర్యటనలకు అనుమతి నిరాకరణ, దాని వెనుక ఉన్న కారణాలు తదితర అంశాలపై హైదరాబాద్‌కు తిరిగొచ్చాక మీడియా ముందుకు వచ్చి మాట్లాడతానని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఆపరేషన్ సిందూర్ దెబ్బ తర్వాత.. మళ్లీ సిద్ధమైన జైష్ ఉగ్ర స్థావరం

- పాక్ బహవల్పూర్‌లో జైషే మహ్మద్ స్థావరం పునర్నిర్మాణం
- ఆపరేషన్ సిందూర్‌లో దెబ్బతిన్న మర్కజ్ సుభానల్లా ఉగ్ర స్థావరం
- స్వయంగా పాక్ ప్రభుత్వ నిధులతోనే నిర్మాణం

**చట్టం, స్టేట్ బ్యూరో:**

పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత, పాకిస్తాన్‌పై భారత్ ''ఆపరేషన్ సిందూర్'' ద్వారా దాడులు చేసింది. ఈ దాడుల్లో పీఓకే, పాకిస్తాన్ వ్యాప్తంగా ఉన్న ఉగ్రవాద స్థావరాలు, ప్రధాన కార్యాలయాలు, ట్రైనింగ్ క్యాంపుల్ని ధ్వంసం చేసింది. ఇందులో ముఖ్యంగా పీఓకేలోని మురిద్కే ఉన్న లష్కరే తోయిబా కార్యాలయం, పాకిస్తాన్ పంజాబ్ ప్రావిన్సులోని బహవల్పూర్‌లో ఉన్న జైషే మహ్మద్ ఉగ్ర కార్యాలయాలను భారత్ ధ్వంసం చేసింది. ముఖ్యంగా పాకిస్తాన్ బహవల్పూర్‌లోని జైష్‌ఎమొహమ్మద్ (JeM) మార్కజ్ సుభాన్ అల్లా ప్రధాన కార్యాలయం ధ్వంసం చేయడం ఆపరేషన్ సిందూర్‌లోనే హైలెట్‌గా నిలిచింది. భారత్ 2025 మే 7న చేసిన దాడిలో జైష్ చీఫ్ మసూద్ అజార్ బంధువులు కూడా మరణించారు. ఇదిలా ఉంటే దాడులు జరిగిన 15 నెలల తర్వాత జైష్ మళ్లీ తన కార్యాలయాన్ని పునర్నిర్మించుకుంది. గతేడాది మేలో భారత దాడుల్లో తీవ్రంగా దెబ్బతిన్న ఈ కాంపౌండ్‌కు కొత్త మార్బుల్, పెయింట్, ప్లాస్టర్ వేశారు. దెబ్బతిన్న గోపురాలను కూడా తిరిగి నిర్మించారు. ప్రధాన హాల్‌లోని దాడుల ఆనవాళ్లను తొలగించి భవనాన్ని పునరుద్ధరించారు. జైషే కార్యాలయం నిర్మాణానికి పాకిస్తాన్ ప్రభుత్వం స్వయంగా 25 కోట్ల పాక్ రూపాయాలను అందించినట్లు తెలుస్తోంది. ఇందులో సుమారు 11 కోట్ల రూపాయల్ని ప్రధాన హాల్ పునర్నిర్మాణానికి ఖర్చు చేసినట్లు సమాచారం. ఇదే కాకుండా ప్రధాన కాంప్లెక్స్‌ను ఆనుకుని ఉన్న మద్రసా అల్ సబీర్, జైషే కమాండర్ల నివాస ప్రాంతాలు కూడా ధ్వంసమయ్యాయి. ఇక్కడ కొత్త నిర్మాణ పనులు జరుగుతున్నట్లు సమాచారం. మార్కజ్ సుభాన్ అల్లా అంతర్జాతీయ సరిహద్దు నుంచి సుమారు 100 కిలోమీటర్ల దూరంలో ఉంది. 18 ఎకరాల్లో విస్తరించిన ఈ కాంప్లెక్స్‌ను ఉస్మాన్‌ఓఅలీ క్యాంపస్ అని కూడా పిలుస్తారు. ఇందులో మసీదుతో పాటు జైష్ కార్యకలాపాలకు సంబంధించిన పలు సౌకర్యాలు ఉన్నాయి. నిజానికి పాక్ ప్రభుత్వం 2002లో జైషే మహ్మద్‌ను నిషేధించినప్పటికీ, ఆ సంస్థ దేశంలో కార్యకలాపాలు సాగిస్తోంది. 2001 పార్లమెంట్ దాడి, 2016 పఠాన్‌కోట్ ఎయిర్‌బేస్ దాడి, 2019 పుల్వామా ఆత్మాహుతి దాడులను జైషే మహ్మద్ నిర్వహించింది.



# విద్యార్థులకు రూ.48 వేల స్కాలర్‌షిప్

- ఏటా రూ.12 వేలు.. నాలుగేళ్లలో రూ.48 వేలు
- 8వ తరగతి విద్యార్థులకు అద్భుత అవకాశం
- రూ.3.50 లక్షలలోపు ఆదాయం ఉంటే అర్హత
- ఆగస్టు 24తో ముగియనున్న దరఖాస్తు గడువు

**చట్టం, స్టేట్ బ్యూరో:**

ప్రతిభ ఉండి కూడా ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 'నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్' పథకాన్ని అందిస్తోంది. తెలంగాణలోని ప్రభుత్వ , ఎయిడెడ్ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 202627 విద్యా సంవత్సరానికి గాను ఈ అవకాశాన్ని కల్పిస్తున్నారు. అయితే ఈ స్కాలర్‌షిప్‌కు అప్లై చేసుకోవడానికి ఆగస్టు 24వ తేదీయే చివరి గడువు అని అధికారులు స్పష్టం చేశారు.




**ఏటా రూ. 12 వేల ఆర్థిక సాయం**

ఈ పథకానికి ఎంపికైన అర్హులైన విద్యార్థులకు ప్రతి నెలా రూ. 1,000 చొప్పున సంవత్సరానికి మొత్తం రూ. 12,000 అందజేస్తారు. 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ పూర్తి అయ్యే వరకు, అంటే వరుసగా నాలుగేళ్ల పాటు మొత్తం రూ. 48,000 ఆర్థిక సాయంగా లభిస్తుంది.

**అర్హతలు , ఎంపిక విధానం**

ఈ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకునే విద్యార్థుల కుటుంబ వార్షికాదాయం రూ. 3.50 లక్షలకు మించకూడదు. విద్యా అర్హతల విషయానికొస్తే, విద్యార్థి 7వ తరగతిలో కనీసం 55% మార్కులు సాధించి ఉండాలి, అయితే ఎస్సీ , ఎస్టీ విద్యార్థులకు 50% మార్కులు ఉంటే సరిపోతుంది. ప్రత్యేకంగా నిర్వహించే రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా విద్యార్థుల ఎంపిక ఉంటుంది. ఈ పరీక్షలో మెంటల్ ఎబిలిటీ టెస్ట్ (MAT), స్కొలాస్టిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (SAT) అనే రెండు విభాగాల ఆధారంగా ప్రశ్నలు అడుగుతారు. కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ, సైనిక్ స్కూళ్లు , ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్ వర్తించదు. ఈ స్కాలర్‌షిప్ లబ్ధి కొనసాగాలంటే విద్యార్థులు తమ తదుపరి చదువును తప్పనిసరిగా ప్రభుత్వ లేదా ఎయిడెడ్ విద్యాసంస్థల్లోనే కొనసాగించాల్సి ఉంటుంది. సమయం తక్కువగా ఉన్నందున అర్హత గల విద్యార్థులు వెంటనే అధికారిక వెబ్‌సైట్ bse.telangana.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.



# ఆటో, క్యాబ్ సమ్మె క్యాన్సిల్.. ప్రభుత్వ చర్చలు సక్సెస్

- ఖైరతాబాద్‌లో సఫలమైన కార్మిక సంఘాల చర్చలు
- డిమాండ్లపై ప్రభుత్వం సానుకూల హామీలు
- సంక్షేమ బోర్డు, ఛార్జీల పెంపుపై కమిటీ
- సమ్మె రద్దుతో ప్రయాణికులకు భారీ ఊరట

**చట్టం, స్టేట్ బ్యూరో:**

నేటి అర్ధరాత్రి నుంచి చేపట్టాలనుకున్న రాష్ట్రవ్యాప్త సమ్మెను ఆటో, క్యాబ్ కార్మికులు విరమించుకున్నారు. రవాణా శాఖ అధికారులు, కార్మిక సంఘాల నాయకుల మధ్య ఖైరతాబాద్‌లోని ఆర్టీవో కార్యాలయంలో జరిగిన చర్చలు సఫలం కావడంతో సమ్మె నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నట్లు జేఏసీ నాయకులు ప్రకటించారు. ఫలించిన చర్చలు.. సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం ఈ సమావేశంలో కార్మిక సంఘాలు లేవనెత్తిన ప్రధాన డిమాండ్లపై అధికారులు సానుకూలంగా స్పందించారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ చర్చల్లో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొని, కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. మంత్రి , అధికారుల హామీతో సంతృప్తి చెందిన కార్మిక నాయకులు సమ్మెను విరమించేందుకు అంగీకరించారు.

**త్వరలోనే జీవో విడుదల చేయాలని డిమాండ్**

తమ ప్రధాన డిమాండ్లైన ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు, ఛార్జీల పెంపునకు కమిటీ, ఎలక్ట్రిక్ వాహనాల మార్పిడికి ఆర్థిక సహాయం వంటి అంశాలపై ప్రభుత్వం త్వరలోనే అధికారికంగా ఉత్తర్వులు (G.O.) విడుదల చేయాలని కార్మిక సంఘాల నాయకులు ఈ సందర్భంగా కోరారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో నేటి అర్ధరాత్రి నుంచి జరగాల్సిన ఆటో, క్యాబ్, స్కూల్ బస్సుల సమ్మె రద్దు కావడంతో ప్రజలు, ముఖ్యంగా నిత్య ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక
CHATTAM NEWS
నిజామాబాద్
సోమవారం
24.08.2026


# బిల్డర్ రాజేందర్ గౌడ్ పై కేసు నమోదు

- బిల్డర్ రాజేందర్ గౌడ్ ఆగడాలు మితిమీరుతున్నాయి అంటున్న గుజరాతి గంగా ప్రకాష్



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని పెర్కిట్ ప్రాంతంలో నేను అనగా గుజరాతి గంగా ప్రకాష్, తండ్రి పేరు రామ్ దాస్, అనే మేము సర్వేనెంబర్ 483/1 ప్లాట్ నెంబర్ 50/C విస్తీర్ణం 223.32 గజాలు గల స్థలాన్ని రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ ద్వారా మున్సిపల్ అనుమతితో ఇల్లు నిర్మాణం చేపట్టినాను. మా యొక్క ప్లాట్ ప్రక్కన ఆర్మూర్ ప్రాంతానికి చెందిన బిల్డర్ రాజేందర్ గౌడ్, రెండు ప్లాట్లు కొనుగోలు చేసి అందులో నాలుగు ఇండ్లు నిర్మాణం చేస్తున్నారు. అతను ఎటువంటి సెట్ బ్యాక్ లేకుండా మున్సిపల్ రోడ్డును ఇంక్రోచ్ అయి నిర్మాణం చేస్తున్నందున నేను ఇట్టి విషయాన్ని మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. అందుకు బిల్డర్ రాజేందర్ గౌడ్ నా మీద కక్షగట్టి మా యొక్క ఇంటి ముందు నిర్మించిన మెట్లు, డ్రైనేజీనీ ట్రాక్టర్ బ్లేడ్, ట్రాక్టర్ నెంబర్ AP 28 DP 7386 తో ధ్వంసం చేసినాడు మరియు ఎందుకు చేశారు. అని అడిగితే బూతు మాటలు తిడుతూ చంపుతానని బెదిరించినాడు. నేను వెంటనే తగు ఆధారాలతో ఆర్మూర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా ఆర్మూర్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి అతనిపై, ట్రాక్టర్, ట్రాక్టర్ డ్రైవర్ పై FIR no. 463/2026 సెక్షన్ 329(4), 324(4), 296(b), 351(2), r/w 3(5) BNS చట్టం ప్రకారం కేసు నమోదు అయినది. రాజేందర్ గౌడ్, ఇతర చోట్లలో కూడా ఇలాగే అరాచకాలు చేస్తూ దౌర్జన్యాలు చేస్తున్నారనీ ప్రకాష్ తెలిపారు. అతని ఆగడాలని అడ్డుకట్ట వేసి చట్టరీత్యా చర్యలు తీసుకొని నాకు న్యాయం చేయాలని పోలీసులను కోరినట్లు తెలిపారు.

# శిశువు మృతి పై సమగ్ర విచారణ జరపాలి

- చర్యలు తీసుకోకపోతే ఊరుకోం
- మాజీ ఎమ్మెల్సీ కవిత




**చట్టం ప్రతినిధి కామారెడ్డి;** కామారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్) లో నవజాత శిశువు మృతి చెందిన ఘటనపై సమగ్ర విచారణ జరపాలని తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పందించారు. శిశువు మృతికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ మేరకు కవిత ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యంతో శిశువు మృతి చెందడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. ప్రసవం కోసం ఆస్పత్రిలో చేరిన ఎక్కపల్లి తండాకు చెందిన గర్భిణికి సకాలంలో డెలివరీ చేయకపోవడం వల్లే శిశువు మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్న విషయాన్ని ఆమె ప్రస్తావించారు.

**పునరావృతం కాకుండా చూడాలి**

శిశువు మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని కవిత ప్రభుత్వాన్ని కోరారు. ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య.. ఇది ఒక్క నేరం కాదు మనందరికీ ఒక హెచ్చరిక ఇదిలా ఉండగా, ఆస్పత్రిలో జరిగిన ఘటనపై బాధిత కుటుంబ సభ్యులు కామారెడ్డి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ బిడ్డ మృతికి కారణమైన వైద్యులపై చర్యలు తీసుకోవాలని వారు ఫిర్యాదులో కోరినట్లు సమాచారం. శిశువు మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమన్న ఆరోపణలపై సంబంధిత అధికారులు దర్యాప్తు చేసి వాస్తవాలను వెల్లడించాల్సి ఉంది.

# దేశాయిపేటలో వీధికుక్కల కలకలం





**చట్టం ప్రతినిధి కామారెడ్డి ;** బాన్సువాడ మండలంలోని దేశాయిపేట గ్రామంలో వీధికుక్కలు మరోసారి రెచ్చిపోయాయి. గ్రామానికి చెందిన ఎనిమిదేళ్ల బాలుడిపై కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బాలుడు మసీదు వద్దకు ఇంటికి వస్తున్న సమయంలో ఒక్కసారిగా దూసుకొచ్చిన వీధికుక్క బాలుడిపై దాడి చేసి కరిచింది. బాలుడి కేకలు విన్న తల్లి దండ్రులు, స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని కుక్కను తరిమికొట్టారు. తీవ్ర గాయాలపాలైన బాలుడిని వెంటనే కుటుంబ సభ్యులు బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అక్కడ బాలునికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

**ఆందోళనలో తల్లిదండ్రులు**

ఇటీవల బాన్సువాడ పట్టణ కేంద్రంలోనూ వీధికుక్కలు దాడి చేసి సుమారు 20 మందికి పైగా గాయపరిచిన ఘటన ప్రజలను భయాందోళనకు గురిచేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు పట్టణ శివారులోని దేశాయిపేటలోనూ కుక్క కాటు ఘటన పునరావృతం కావడంతో గ్రామస్థులు, బాలుడి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపిల్లలను బయటకు పంపాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు.

*** స్పందించని అధికారులు....**

పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లోనూ వీధికుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతున్నది. ఇప్పటికైనా మున్సిపల్, పంచాయతీ అధికారులు స్పందించి వీధికుక్కల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని, లేదంటే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

*** బాన్సువాడలో ఒకరికి డెంగ్యూ...**

బాన్సువాడ పట్టణంలో నివసించే ఒక వ్యక్తి డెంగీ బారిన పడ్డారు. దోమలు అధికమవడంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. సదరు వ్యక్తికి ప్లేట్లెట్లు తగ్గిపోవడంతో ఆసుపత్రి లో చేర్పించారు. అయితే టెస్టులు చేయగా డెంగీ అని తేలింది. ఇంచార్జ్ కమిషనర్ తీరుపై మాజీ కార్పొరేటర్ సుమలత రాజు ఆగ్రహం

# ఇంచార్జ్ కమిషనర్ తీరుపై మాజీ కార్పొరేటర్ సుమలత రాజు ఆగ్రహం

- సమయపాలన లేకుండా సమావేశాలు నిర్వహిస్తూ
- ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపణ



**చట్టం రామగుండం :** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇంచార్జ్ కమిషనర్ వ్యవహారశైలిపై మాజీ కార్పొరేటర్ నగునూరి సుమలత రాజు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇతర మున్సిపల్ కార్పొరేషన్లు ప్రజోపయోగ కార్యక్రమాలు, అభివృద్ధి పనులతో ముందుకు సాగుతుండగా, రామగుండంలో మాత్రం పరిపాలనా వ్యవస్థ గాడి తప్పుతోందని ఆమె ఆరోపించారు. కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కార్మికులు, అధికారులు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందితో కమిషనర్ వ్యవహరిస్తున్న తీరు అభ్యంతరకరంగా ఉందని సుమలత రాజు పేర్కొన్నారు. కార్యాలయ సమయం ముగిసే సమయంలో రివ్యూ సమావేశాలు నిర్వహించడం, గంటల తరబడి సిబ్బందిని కార్యాలయంలోనే ఉంచడం, షోకాజ్ నోటీసుల పేరుతో ఒత్తిడికి గురిచేయడం జరుగుతోందని ఆరోపించారు.

**అభివృద్ధిపై దృష్టి పెట్టాలని డిమాండ్**

రాష్ట్రంలో ప్రతిష్టాత్మక మున్సిపల్ కార్పొరేషన్‌గా ఉన్న రామగుండంను పారిశుద్ధ్యం, మౌలిక వసతులు, ప్రజా సేవల్లో అగ్రస్థానంలో నిలపాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అయితే అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాల్సిన సమయంలో ఉద్యోగులపై ఒత్తిడి పెంచడం సరికాదని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వకుండా ఇతర అంశాలపై అధికారులు దృష్టి సారిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయని తెలిపారు. అభివృద్ధి పనులు, పరిపాలనా వ్యవహారాలపై కమిషనర్ ప్రజలకు స్పష్టత ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు.

**ఉద్యోగులపై ఒత్తిడి తగదు**

కిందిస్థాయి ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని గౌరవంగా చూడాలని సుమలత రాజు కోరారు. ఉద్యోగులను బెదిరించడం, మానసిక ఒత్తిడికి గురిచేయడం వంటి ఆరోపణలపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని అన్నారు. రామగుండంలో పనిచేసేందుకు కొందరు అధికారులు ఆసక్తి చూపని పరిస్థితి ఏర్పడుతోందని ఆమె ఆరోపించారు. స్థానిక సంస్థల పాలన మరింత సమర్థవంతంగా సాగేందుకు రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరారు.

**వైఖరి మార్చుకోకపోతే ఉద్యమం**

ఇంచార్జ్ కమిషనర్ తన పని విధానాన్ని మార్చుకుని కార్మికులు, ఉద్యోగుల సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని సుమలత రాజు సూచించారు. పరిస్థితిలో మార్పు రాకపోతే బాధిత ఉద్యోగులు, కార్మిక సంఘాలను కలుపుకొని ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# రైతు వేదిక ప్రాంగణంలో స్వచ్ఛ భారత్




**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో గల రైతు వేదిక ఆవరణలో ఆదివారం స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించారు. రైతు వేదిక ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలు, చెత్తచెదారాన్ని తొలగించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్మూర్ మహాత్మ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సుంకె శ్రీనివాస్, మాట్లాడుతూ ప్రతి ఆదివారం ఒక గంట అనే నినాదంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం 68వ వారానికి చేరుకుందన్నారు. ఇందులో భాగంగా రైతుల సమస్యలపై చర్చించే రైతు వేదిక ఆవరణను శుభ్రం చేశామన్నారు. రైతు వేదిక వద్దకు వెళ్లేందుకు సరైన మార్గం లేక లేక పిచ్చిమొక్కలతో ఆవరణ మొత్తం నిండిపోయిందని, దానిని తొలగించి వెళ్లేందుకు మార్గం సుగుమం చేశామన్నారు. ఇదే విధంగా ప్రతి వారం ఇటువంటి స్వచ్ఛ కార్యక్రమాలు నిర్విరామంగా కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ సభ్యులు సుంకె నిశాంత్, వేద జీడి రాజ్ కుమార్, కుకింగ్ నరేష్, గణేష్, రిపోర్టర్ రమేష్, వేణు, కృషివర్ధన్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వంగవీటి మోహనరంగా విగ్రహ ఆవిష్కరణ

- సామాజిక న్యాయం సమానత్వం ఐకమత్యమే సమాజ అభివృద్ధికి బాటలు వేస్తుంది ఎమ్మెల్యే జారే





**చట్టం అశ్వారావుపేట :** అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలో మండల కాపు సామాజిక వర్గాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రముఖ ప్రజానాయకుడు వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో అన్ని సామాజిక వర్గాల మధ్య ఐకమత్యం, సోదరభావం, పరస్పర గౌరవం, సామాజిక న్యాయం, సమానత్వం వంటి అంశాలపై ఎమ్మెల్యే జారే ఆదినారాయణ విస్తృతంగా ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి వంగవీటి మోహనరంగా కుమారుడు వంగవీటి రాధాకృష్ణ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు, యడవల్లి కృష్ణ, కరాటం రాంబాబు విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కాపు సామాజిక వర్గాల నాయకులు, యువత, రంగా అభిమానులు, వివిధ సామాజిక వర్గాల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ వంగవీటి మోహనరంగా ప్రజల కోసం నిలబడిన నాయకుడిగా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. పేదలు, బడుగు, బలహీన వర్గాలు సామాన్య ప్రజల సమస్యలపై ఆయన పోరాటం చేశారని ప్రజల పట్ల ఆయనకు ఉన్న నిబద్ధతను నేటి తరం గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో ప్రతి కులానికి ప్రతి వర్గానికి సముచిత గౌరవం, సమాన అవకాశాలు లభించడమే నిజమైన సామాజిక న్యాయమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కులాలు, మతాలు, ప్రాంతాలు వేరైనా మనమంతా ఒకే సమాజంలో జీవిస్తున్న సోదరులమని పరస్పరం గౌరవించుకుంటూ ముందుకు సాగినప్పుడే నియోజకవర్గం, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఎవరినీ తక్కువగా చూడకుండా ఏ సామాజిక వర్గాన్నీ విస్మరించకుండా ప్రతి ఒక్కరినీ సమానంగా గౌరవించుకోవాలని పిలుపునిచ్చారు. అణగారిన వర్గాలకు అండగా నిలవడం పేదల సంక్షేమం కోసం పనిచేయడం, వెనుకబడిన వర్గాలకు అవకాశాలు కల్పించడం ప్రజాప్రతినిధుల బాధ్యత మాత్రమే కాకుండా సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

**బీసీల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది**

బీసీలకు రాజకీయ, సామాజిక, విద్య, ఉద్యోగ రంగాల్లో మరిన్ని అవకాశాలు కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ వివరించారు. బీసీలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం, రిజర్వేషన్ల సాధనతో పాటు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని తెలిపారు. బీసీల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతున్న విషయాన్ని కూడా ఎమ్మెల్యే వివరించారు. బీసీ వర్గాలకు చెందిన యువతకు విద్య, ఉద్యోగ, స్వయం ఉపాధి అవకాశాలు మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలోని వెనుకబడిన వర్గాలకు అభివృద్ధి ఫలాలు సమానంగా అందినప్పుడే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కాపు సామాజిక వర్గం మాత్రమే కాకుండా అన్ని సామాజిక వర్గాల ప్రజలు ఐక్యంగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఒకరి విజయాన్ని మరొకరు అభినందిస్తూ ఒకరి కష్టాల్లో మరొకరు అండగా నిలవాలని అన్నారు. కులాల మధ్య చిచ్చు పెట్టే విధానాలకు దూరంగా ఉండి అన్ని వర్గాల మధ్య సోదరభావాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అశ్వారావుపేట నియోజకవర్గం భిన్న సామాజిక వర్గాలు, భిన్న సంస్కృతులు, సంప్రదాయాలతో కూడిన ప్రాంతమని ఇక్కడి ప్రజల మధ్య ఉన్న ఐక్యత, ఆత్మీయత నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపును తీసుకొస్తుందని అన్నారు. మనమంతా ఒక్కటే మన నియోజకవర్గ అభివృద్ధే మనందరి లక్ష్యం అనే భావనతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రజల మధ్య విభేదాలు సృష్టించడం ద్వారా ఎవరికీ ప్రయోజనం ఉండదని ఐకమత్యంతో సమస్యలను పరిష్కరించుకుంటూ అభివృద్ధి వైపు అడుగులు వేయాలని సూచించారు. అన్ని కులాలు, అన్ని వర్గాల ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ ప్రతి ఒక్కరి హక్కులను గౌరవిస్తూ ముందుకు వెళ్లడమే తన లక్ష్యమని తెలిపారు. వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని అశ్వారావుపేటలో ఏర్పాటు చేయడం ద్వారా ఆయన సేవలను పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు పరిచయం చేసే అవకాశం ఏర్పడిందని ఎమ్మెల్యే అన్నారు. రంగా ఆశయాలను స్మరించుకోవడంతో పాటు పేదలు సామాన్యులు బలహీన వర్గాల కోసం పనిచేయాలనే స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలిచిందని అన్ని వర్గాల ప్రజలు పరస్పర గౌరవంతో సోదరభావంతో కలిసి పనిచేస్తే అశ్వారావుపేట నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లవచ్చని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పేర్కొన్నారు.

# వెల్‌జర్లలో వానరుల బెడద


- రోజూ గాయాలు, రాత్రింబవళ్లు భయాందోళనకు గురవుతున్న ప్రజలు
- ఇప్పటివరకు పదుల సంఖ్యలో గాయాలు కాగా నేడు ఆదివారం మరొకరికి తీవ్ర గాయం
- కోతుల బెడద నుండి తమని రక్షించాలంటూ డిమాండ్



**చట్టం, షాద్ నగర్ ప్రతినిధి:–** గ్రామంలో ప్రశాంతంగా ఉండాల్సిన రోజువారీ జీవితం ఇప్పుడు భయంతో నిండిపోయింది. గుంపులుగా సంచరిస్తున్న కోతులు జనావాసాల్లోకి చొరబడి ఆహారం ఎత్తుకెళ్లడమే కాకుండా...అడ్డొచ్చిన వారిపై దాడులు చేస్తూ గ్రామస్తులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఫరూఖ్ నగర్ మండలం వెల్ జర్లలో కోతుల బెడద రోజురోజుకూ తీవ్రతరమవుతోంది. ఇళ్లలోకి ప్రవేశించి పండ్లు, కూరగాయలు, ఆహార పదార్థాలను తీసుకెళ్లడం సాధారణమైపోయింది. అడ్డొచ్చిన వారిపై విచక్షణ రహితంగా దాడి చేసి గాయపరుస్తున్నాయి. ఇప్పటికే పదుల సంఖ్యలో గ్రామస్తులు కోతుల దాడుల్లో గాయపడినట్లు స్థానికులు చెబుతున్నారు . తాజాగా ఆదివారం సాయంత్రం మరో వ్యక్తి పై కోతులు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటనతో గ్రామంలో భయాందోళన పెరిగింది. మహిళలు, చిన్నారులు, వృద్ధులు బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు కూడా దాడుల భయంతో అప్రమత్తంగా సంచరించాల్సి వస్తోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజూ భయంతోనే బయటకు వెళ్తున్నాం. ఎప్పుడు దాడి జరుగుతుందో తెలియదని గ్రామస్తులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. గ్రామస్తులు ఇప్పుడు కేవలం కోతుల భయంతోనే కాదు, అధికారుల నిర్లక్ష్యంతో కూడా బాధపడుతున్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకకపోతే గ్రామంలో భయాందోళనలు మరింత పెరుగుతాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతుల బెడదపై పలుమార్లు అధికారులకు విన్నవించినా ఇంత వరకు శాశ్వత పరిష్కారం లభించలేదని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామ పరిసరాల్లో ఆహారం, చెట్ల కొరత కారణంగానే కోతులు జనావాసాల్లోకి వస్తున్నాయని వారు అంటున్నారు.ఇప్పటికైనా అటవీ శాఖ అధికారులు స్పందించి కోతులను పట్టుకుని అటవీ ప్రాంతాలకు తరలించాలని, మరిన్ని దాడులు జరగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# గాంధీనగర్‌లో కార్పొరేషన్ గ్రిల్స్‌కు కత్తెర.. వ్యాపారుల తీరుపై ఆగ్రహం

- పాదచారుల భద్రత కోసం ఏర్పాటు చేసిన గ్రిల్స్‌ను వెల్డింగ్‌తో తొలగిస్తున్నారనే ఆరోపణలు
- చర్యలు తీసుకోవాలని వాహనదారులు, పాదచారుల డిమాండ్



చట్టం, రామగుండం : గోదావరిఖని గాంధీనగర్ ప్రధాన రహదారిపై పాదచారుల భద్రత కోసం రామగుండం నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన గ్రిల్స్‌ను కొందరు దుకాణదారులు తమ వ్యాపార అవసరాల కోసం వెల్డింగ్‌తో కట్ చేస్తున్న ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ప్రజల రక్షణ కోసం లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన గ్రిల్స్‌ను స్వలాభం కోసం తొలగించడం ఎంతవరకు సమంజసమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి ప్రధాన చౌరస్తా మీదుగా ఫైవ్ ఇంక్లైన్ చౌరస్తా వరకు రోడ్డుకు ఇరువైపులా గ్రిల్స్ ఏర్పాటు చేశారు. అయితే గ్రిల్స్ వెనుక భాగంలో ఉన్న కొన్ని దుకాణాలకు వినియోగదారులు నేరుగా వెళ్లేందుకు అవి అడ్డుగా ఉన్నాయనే కారణంతో కొందరు వ్యాపారులు వాటిని బాహాటంగా కట్ చేస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. గాంధీనగర్ ప్రాంతంలోని సింగరేణి క్వార్టర్ల ముందు ఖాళీ స్థలాల్లో షెడ్లు ఏర్పాటు చేసి వాటిని అద్దెకు ఇచ్చినట్లు సమాచారం. ఆయా షెడ్లలో వ్యాపారాలు నిర్వహిస్తున్న కొందరు, దుకాణాలకు రాకపోకలు సులభంగా ఉండేందుకు కార్పొరేషన్ ఏర్పాటు చేసిన గ్రిల్స్‌ను తొలగిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో గాంధీనగర్ నుంచి రాజేష్ టాకీస్ వరకు రహదారికి ఇరువైపులా టిఫిన్ సెంటర్లు, కర్రీ పాయింట్లు, చపాతీ, మీల్స్ దుకాణాలు పెద్ద సంఖ్యలో ఏర్పాటు కావడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయని స్థానికులు చెబుతున్నారు. ట్రాఫిక్ సమస్యల నేపథ్యంలో నగరపాలక సంస్థ అధికారులు ఫుట్‌పాత్‌లపై ఉన్న దుకాణాలను తొలగించి, ప్రజల రాకపోకలకు ఆటంకం కలగకుండా చూడాలని ఆదేశించినట్లు సమాచారం. కొంతకాలం నిబంధనలు పాటించిన వ్యాపారులు తిరిగి ఫుట్‌పాత్‌లపై దుకాణాలు ఏర్పాటు చేయడంతో అధికారులు గ్రిల్స్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అదే గ్రిల్స్‌ను కొందరు వెల్డింగ్‌తో కట్ చేసి వ్యాపార కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ప్రజాధనంతో ఏర్పాటు చేసిన గ్రిల్స్‌ను అనుమతి లేకుండా తొలగిస్తుంటే సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడం లేదని పాదచారులు ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవహారంపై రామగుండం నగరపాలక సంస్థ అధికారులు తక్షణమే పరిశీలన జరిపి, గ్రిల్స్‌ను తొలగించిన వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలపై కూడా చర్యలు చేపట్టి పాదచారులకు సురక్షితమైన మార్గం కల్పించాలని వాహనదారులు, స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# జెండా పండుగ ముగింపు వేడుకలో పాల్గొన్న వినయ్ కుమార్ రెడ్డి



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలో జెండా బాలాజీ జాతర పండుగ ముగింపు వేడుక కార్యక్రమంలో పాల్గొన్న ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి. వారితో పాటు పాల్గొన్న ఆర్మూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏఎంసీ చైర్మన్ సాయిబాబా గౌడ్, నిజామాబాద్ డిసిసి సెక్రెటరీ సాయినాథ్ గౌడ్, ఆర్మూరు మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు శాంతి, కౌన్సిలర్లు నవీన్, ప్రసాద్, గంగోలి, తాటి హనుమాన్లు, కాంగ్రెస్ నాయకులు శాంతి, ఆర్మూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నాగరాజు, మాక్లూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు దయాకర్ రావు, కాంగ్రెస్ నాయకులు నూతల నారాయణరెడ్డి, చిట్టి రెడ్డి, దేగాం శ్రీనివాస్ గౌడ్, ఏలియా రెడ్డి, గంగాధర్ గౌడ్, రాము, వెంకటగిరి, పివిఆర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారి స్నిగ్ధకు చేయూతనివ్వండి


- కంటి ఆపరేషన్‌కు రూ.లక్ష అవసరం..
- దాతలకు సమతా ఫౌండేషన్ విజ్ఞప్తి



**చట్టం రామగుండం :** కంటి చూపు సమస్యతో బధపడుతున్న 11 ఏళ్ల చిన్నారి ఇంజపురి స్నిగ్ధకు ఆపన్నహస్తం అందించాలని సమతా ఫౌండేషన్ చైర్మన్ డా. దుర్గం నగేష్ దాతలను కోరారు. రామగుండం కార్పొరేషన్ 33వ డివిజన్ అన్నపూర్ణ కాలనీకి చెందిన స్నిగ్ధకు కంటి చూపు పూర్తిగా మందగించిందని, ఆపరేషన్‌కు సుమారు రూ.లక్ష వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలిపినట్లు పేర్కొన్నారు.చిన్నారి తండ్రి లేకపోవడంతో తల్లి కూలి పనులు చేస్తూ ఇద్దరు ఆడపిల్లలను పోషిస్తోందని తెలిపారు. నిరుపేద కుటుంబం కావడంతో వైద్య ఖర్చులు భరించే పరిస్థితి లేదన్నారు. దాతలు మానవతా దృక్పథంతో ముందుకొచ్చి తమకు తోచిన ఆర్థిక సహాయం అందించి చిన్నారి చికిత్సకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరి చిన్న సాయం స్నిగ్ధ భవిష్యత్తుకు వెలుగునిస్తుందని పేర్కొన్నారు.సహాయం కోసం ఫోన్‌పే/గూగుల్‌పే: 9704854669

# మిలాద్‌ఉన్‌నబీ సందర్భంగా రక్తదాన శిబిరం

- రక్తదాతలను అభినందించిన ప్రభుత్వ విప్ విజయరమణ రావు




**చట్టం, పెద్దపల్లి :** మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని పవిత్ర మిలాద్‌ఉన్‌నబీ సందర్భంగా ఆదివారం పెద్దపల్లి పట్టణంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. మర్కజ్ మిలాద్ కమిటీ పెద్దపల్లి ఆధ్వర్యంలో ఎం.బి. గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన దాతలను విజయరమణ రావు అభినందించి, వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. రక్తదానం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారి ప్రాణాలను కాపాడేందుకు సహకరించవచ్చని పేర్కొన్నారు. యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదాన కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో మర్కజ్ మిలాద్ కమిటీ సభ్యులు, పట్టణ కౌన్సిలర్లు, మైనారిటీ మత పెద్దలు, కాంగ్రెస్ నాయకులు, రక్తదాతలు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబాలకు అండగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పూజల హరికృష్ణ



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** చిన్నకోదూర్ మండలం పెద్దకోదూర్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన మామిడిపల్లి పోచయ్య, మద్ది నారాయణ నిరుపేద కుటుంబాలను సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పూజల హరికృష్ణ కుటుంబాలకు అండగా నిలిచారు. ఈ సందర్భంగా మృతి చెందిన కుటుంబాలకు 50 కిలోల చొప్పున బియ్యాన్ని అందజేసి, ఆపద సమయంలో కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఎం.సి వైస్ చైర్మన్ బుస్స రాజశేఖర్, వార్డు మెంబర్ల రవి, రాజు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు లహరి, విఠలపూర్ సర్పంచ్ నాగరాణి ఎల్లం, ఈ.ఎక్స్ ఓబిసి సెల్ మండల అధ్యక్షుడు బంక చిరంజీవి, ఏ.ఎం.సి డైరెక్టర్ల విజయ్ కుమార్, భూపతి రెడ్డి, ఆత్మ కమిటీ డైరెక్టర్ కనుకయ్య, మండల కాంగ్రెస్ నాయకులు బాలరాజు, రాజేందర్, సంపత్, రామకృష్ణ, సిద్ధు, అంజయ్య, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

# పాపహరేశ్వర ఆలయంలో మహా అన్నదానం

**భారీగా తరలివచ్చిన భక్తులు**



**చట్టం, బాసర :** నిర్మల్ జిల్లా బాసర మండల కేంద్రంలోని అతి పురాతన పాపహరేశ్వర ఆలయం వద్ద ఆదివారం నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. బాసర గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని పాపహరేశ్వర ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించాలని గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు నిర్ణయించారు. ఇందులో భాగంగా తెల్లవారుజామున శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బిల్వార్చన, అభిషేకం, ప్రత్యేక అలంకరణతో స్వామివారిని పూజించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. బాసరతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తుల రాకతో ఆలయ పరిసరాలు శివనామస్మరణతో సందడిగా మారాయి. పాపహరేశ్వర ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగించాలనే సంకల్పంతో కార్యక్రమాన్ని చేపట్టినట్లు బాసర గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో మీడియా కీలక పాత్ర పోషించాలి


- ప్రజాదర్బార్ ఎడిటర్ జి. వేణుగోపాల్ శర్మ
- వాస్తవాలకు పెద్దపీట వేస్తూ.. ప్రజల గొంతుకగా ప్రజాదర్బార్‌ను ముందుకు తీసుకెళ్తాం
- పాల్గొన్న తెలంగాణ కోఆర్డినేటర్ రవికాంత్
- రంగారెడ్డి జిల్లా బ్యూరో వి. మల్లికార్జున్ నాయక్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహణ
- ప్రజల పక్షాన నిలిచే జర్నలిజమే లక్ష్యం.. సమస్యల పరిష్కారమే ధ్యేయం
- రంగారెడ్డి జిల్లా సమ్మేళనానికి భారీగా హాజరైన రంగారెడ్డి జిల్లా ప్రజాదర్బార్ రిపోర్టర్లు




**చట్టం, షాద్ నగర్ ప్రతినిధి:–** ప్రజాదర్బార్ తెలుగు దినపత్రిక రంగారెడ్డి జిల్లా బ్యూరో చీఫ్ వి.మల్లికార్జున్ నాయక్ ఆధ్వర్యంలో డైమండ్ బావార్చి రెస్టారెంట్‌లో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ప్రజాదర్బార్ తెలుగు దినపత్రిక ఎడిటర్ జి. వేణుగోపాల్ శర్మ, దినపత్రిక వ్యవస్థాపకులు, తెలంగాణ రాష్ట్ర సమన్వయకర్త రవికాంత్, రంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ హరికిషన్ రెడ్డి, జిల్లా బ్యూరో వి. మల్లికార్జున్ నాయక్ తో పాటు పలువురు జిల్లా పాత్రికేయులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎడిటర్ జి. వేణుగోపాల్ శర్మ మాట్లాడుతూ ప్రజలకు వాస్తవ సమాచారాన్ని అందించడమే జర్నలిజం ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు ప్రజలకు, ప్రభుత్వ అధికారులకు మధ్య వారధిగా పాత్రికేయులు పని చేయాలని సూచించారు. వార్తలను ప్రచురించే సమయంలో వాస్తవాలను నిర్ధారించుకొని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు.ప్రజాదర్బార్ తెలుగు దినపత్రికను మరింత విస్తరించి ప్రజలకు చేరువ చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని జి. వేణుగోపాల్ శర్మ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజా సమస్యలకు ప్రాధాన్యత కల్పిస్తూ సామాన్యుల గొంతుకగా పత్రికను ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని అన్నారు. పాత్రికేయుల సంక్షేమం, వృత్తిపరమైన అభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర సమన్వయకర్త రవికాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ప్రజాదర్బార్ తెలుగు దినపత్రికను బలోపేతం చేయడంతో పాటు స్థానిక సమస్యలను వెలుగులోకి తీసుకురావడంపై ప్రత్యేక దృష్టిసారిస్తామని తెలిపారు. పాత్రికేయులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల సమస్యలకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.రంగారెడ్డి జిల్లా బ్యూరో మల్లికార్జున్ నాయక్ మాట్లాడుతూ, ప్రజాదర్బార్ తెలుగు దినపత్రికను రంగారెడ్డి జిల్లాలో మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో పాత్రికేయులు చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. ప్రజలకు ఉపయోగపడే వార్తలకు ప్రాధాన్యతనిస్తూ, వాస్తవాలను నిర్భయంగా ప్రజల ముందుకు తీసుకురావాలని తెలిపారు. జిల్లాలోని పాత్రికేయులకు అవసరమైన సహకారం అందిస్తూ పత్రిక అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు.రంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ హరికిషన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకురావడంలో ప్రజాదర్బార్ తెలుగు దినపత్రిక చేస్తున్న కృషిని అభినందించారు. జిల్లా స్థాయిలో పాత్రికేయులకు అవసరమైన సహకారం, సమన్వయం అందిస్తామని తెలిపారు.సమావేశంలో పాల్గొన్న పాత్రికేయులు స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రస్తావించారు. ప్రజల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి మీడియా వేదికగా నిరంతరం కృషి చేయాలని నిర్ణయించారు.అనంతరం రంగారెడ్డి జిల్లా పాత్రికేయులు ఘనంగా సత్కరించారు. సమావేశంలో పలు అంశాలపై చర్చించి, భవిష్యత్తులో ప్రజా సమస్యల పరిష్కారం కోసం మీడియా ద్వారా మరింత సమర్థవంతంగా పనిచేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో మండల పాత్రికేయులు రవీందర్ గౌడ్, సాయి, రవి, నరేష్, రాజు, రాజేందర్, రాములు, శ్రీనివాస్, కృష్ణ, చందు, నరసింహ, రాజు నాయక్, రామకృష్ణ, సౌమ్య, మీడియా ఇంచార్జ్ వేణు, శ్రీను, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

## భక్తుల రద్దీపై ఈవో ప్రత్యేక దృష్టి


- భీమేశ్వర ఆలయంలో పర్యవేక్షణ



**చట్టం న్యూస్ వేములవాడ రూరల్:** సెలవు దినం కావడంతో రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధంగా ఉన్న శ్రీ భీమేశ్వర స్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కార్య నిర్వహణాధికారి (ఈవో) ఎల్. రమాదేవి ఆలయ ప్రాంగణంలోని వివిధ ప్రాంతాలను స్వయంగా పరిశీలించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయంలో పారిశుభ్రతను నిరంతరం కాపాడాలని, భక్తులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ భక్తుల వద్ద డబ్బులు అడగడం, తీసుకోవడం చేయరాదని స్పష్టం చేశారు. ఎస్పీఎఫ్ సిబ్బంది, హోంగార్డులకు కూడా ఈవో ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. ఆలయంలో ఫోటోలు, వీడియోలు తీయకుండా అప్రమత్తంగా ఉండాలని, ఎగ్జిట్ మార్గం ద్వారా ఎవరినీ ఆలయంలోకి అనుమతించరాదని సూచించారు. భక్తుల వద్ద అక్రమంగా డబ్బులు వసూలు చేయడం లేదా వారికి ఇబ్బందులు కలిగించే ఘటనలు గుర్తిస్తే వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని ఆదేశించారు. అనంతరం క్యూ లైన్లలోని భక్తులను ఈవో స్వయంగా కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మరిన్ని సౌకర్యాలు అవసరమా అని ఆరా తీశారు. లడ్డూ ప్రసాదం విక్రయ కౌంటర్‌ను పరిశీలించి సేవల నిర్వహణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆలయంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ భక్తులకు అందుతున్న సేవలను సమీక్షించారు.


## పేదోడి సొంతింటి కల సహకారం ఇందిరమ్మ ఇల్లు

- పేద ప్రజల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం
- నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజి రెడ్డి



**చట్టం న్యూస్ వెల్దుర్తి :** వెల్దుర్తి మండల పరిధిలోని దామరంచ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా మంజూరైన ఇంటి నిర్మాణం పూర్తి కావడంతో లబ్ధిదారుని ఆహ్వానం మేరకు ఆదివారం కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి హాజరై మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు హనుమన్న గారి నరేందర్ రెడ్డి, మండల నాయకులు తలారి మల్లేష్ ముదిరాజ్, నరసింహారెడ్డి, లబ్ధిదారులతో కలిసి రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ పేద ప్రజల సొంతింటి కల నెరవేర్చాలననే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీలకతీతంగా నిజమైన లబ్ధిదారులను గుర్తించి ఎన్నికలలో ఇచ్చిన హామీల మేరకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు 5 లక్షల రూపాయలు మంజూరు చేసి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నెరవేర్చినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాగమణి-విట్టల్ గౌడ్, శేఖర్ గౌడ్, షేక్ రెడ్డి, యాదవ్ గౌడ్, సిద్దయ్య, రిటైర్డ్ టీచర్ పోచయ్య, డీలర్ షేకులు, లబ్ధిదారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో దంచికొట్టిన భారీ వర్షం




**చట్టం ప్రతినిధి కామారెడ్డి ;** పది రోజులుగా ఎండ వేడిమి, ఉక్క పోతతో అల్లాడిపోతున్న ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రజలకు, వర్షం కోసం ఎదురుచూస్తున్న అన్నదాతలకు ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షం ఎంతో ఊరటనిచ్చింది. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు కురిసిన వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పంటలకు జీవధార రక్షణగా నిలిచిన వాన మరో వారం రోజులు వర్షాలు పడకపోతే వర్షాధార పంటలు ఎండిపోయే ప్రమాదం ఉన్న తరుణంలో ఈ వర్షం పంటలకు ప్రాణం పోసింది.

*** ఆయకట్టులో ఉత్సాహం...**

నిజాంసాగర్ ఆయకట్టు ప్రాంతంతో పాటు బాన్సువాడ, బోధన్, కామారెడ్డి, జుక్కల్, ఎల్లారెడ్డి, గాంధారి, లింగంపేట్, భిక్కనూర్, సదాశివ్ నగర్ ప్రాంతాల్లో సాగు చేసిన వరి, సోయాబీన్,
పత్తి, మొక్కజొన్న, పెసర పంటలకు ఈ వర్షం ఎంతో మేలు చేసింది
జలకళ సంతరించుకున్న జలాశయాలు

*** నిజాంసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం 13 టీఎంసీలకు చేరుకుంది...**

పోచారం, కోలాస్, శ్రీరామ్ సాగర్, కళ్యాణి ప్రాజెక్టులతో పాటు మంజీరా, గోదావరి నదుల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. జిల్లాలోని చెరువులు, వాగులు, వంకలు నిండుకుండలా మారి పొంగిపొర్లుతున్నాయి. ఈ వానకాలం సీజన్‌కు సరిపడా వర్షం పడడంతో పంటలకు ఎలాంటి డోకా లేదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షం కారణంగా నిజామాబాద్, బోధన్, కామారెడ్డి ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

## ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో టీఆర్ఎస్ పోటీ

- సమాజ శ్రేయస్సుకు 'పంచ జన్యాలు' కీలకం: మండల ఇన్‌చార్జ్ నల్లచెరువు నరేందర్ గౌడ్



**చట్టం న్యూస్, వెల్దుర్తి :** రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో వెల్దుర్తి మండలంలోని అన్ని స్థానాల్లో టీఆర్ఎస్ అభ్యర్థులను బరిలో నిలపనున్నట్లు పార్టీ మండల ఇన్‌చార్జ్ నల్లచెరువు నరేందర్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచభూతాలు మానవాళికి ఎంత ముఖ్యమో, సమాజ శ్రేయస్సుకు టీఆర్ఎస్ ప్రతిపాదిస్తున్న 'పంచ జన్యాలు' కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. ఉచిత విద్య, ఉచిత వైద్యం, నిరుపేదలకు ఎకరం భూమి, సామాజిక న్యాయం, రాజకీయాల్లో మహిళలకు సమానత్వం వంటి ఐదు ప్రధాన అంశాలతో ప్రజల్లోకి వెళ్తున్నట్లు తెలిపారు. తమిళనాడు రాజకీయాల్లో సినీ నటుడు విజయ్ తన మేనిఫెస్టో ద్వారా ప్రజల దృష్టిని ఆకర్షించిన అంశాన్ని ప్రస్తావించిన నరేందర్ గౌడ్, తెలంగాణలో కల్వకుంట్ల కవిత ప్రతిపాదించిన 'పంచ జన్యాలు' కూడా ప్రజల్లో చర్చకు దారితీస్తున్నాయని పేర్కొన్నారు. యువత, మేధావులు, రైతులు, కార్మికులు టీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. వెల్దుర్తి మండల ప్రజల భవిష్యత్తు, భావితరాల ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకుని ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో ప్రజల ముందుకు వెళ్తామని నల్లచెరువు నరేందర్ గౌడ్ తెలిపారు.

## జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన బొంపల్లి భవాని



**చట్టం ప్రతినిధి కామారెడ్డి ;** తెలంగాణ నుంచి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన బొంపల్లి భవాని కామారెడ్డి జిల్లా గాంధారి మండల కేంద్రంలోని బాలికల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విధులు నిర్వహిస్తున్న భవాని కేంద్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన 48 మందితో కూడిన జాబితాలో తెలంగాణ నుంచి ఆమెకు చోటు దక్కింది గురుపూజోత్సవం పురస్కరించుకొని సెప్టెంబర్ 5న ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా ఆమె అవార్డు అందుకోనున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2018 నుంచి బాలికల ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ యూట్యూబ్ ఇన్స్టాగ్రామ్ అకౌంట్ల ద్వారా వినుత రీతిలో విద్యార్థులకు బోధన చేస్తూ పేరు పొందరు. విద్యార్థులకు అర్థం అయ్యో విధంగా వివిధ రకాలుగా బోధన చేయడం గోడల పై చిత్రల వేసి విద్యార్థులకు వివరించడం ద్వారా సులభంగా అర్థం అవుతాది అన్ని వివరించారు. గతంలో మండల,జిల్లా,రాష్ట్ర ఉత్తమఉపాధ్యాయులకు అవార్డు వచ్చింది దీనికి నా కృషితో పాటు నా హస్బెండ్, పాఠశాల తోటిఉపాధ్యాయులు,విద్యార్థుల కృషితోనే జాతీయ అవార్డు సాధ్యమైందని పేర్కొంది. విద్యార్థులకు విద్యతోపాటు,క్రీడలు ఆడిపీయడం, కల్చరర్స్ ఆక్టివిటీస్ పాఠశాలలో నిర్వహించడం ద్వారా పిల్లలు పాఠశాల పట్ల ఆసక్తి చూపుతారని తెలిపింది. గతేడాది 2025 లో భవానికి రాష్ట్రస్థాయి ఉత్తమ్ పురస్కారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు.

## నారాయణఖేడ్‌లో బాలాజీ అనురాధ హాస్పిటల్ ప్రారంభం

- రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ చేతుల మీదుగా ప్రారంభోత్సవం



**చట్టం నారాయణఖేడ్ :** సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన బాలాజీ అనురాధ హాస్పిటల్‌ను రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ శేట్కర్, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మికాంత రావు, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే కె. మదన్ మోహన్ రావు, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొన్నారు. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు చేరువ కావాల్సిన అవసరం ఉందన్నారు. ఆధునిక వైద్య పరికరాలు, నిపుణులైన వైద్యుల సహకారంతో పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటు ధరల్లో వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి యాజమాన్యానికి సూచించారు.
హాస్పిటల్ నిర్వాహకులు మాట్లాడుతూ నారాయణఖేడ్ పట్టణంతో పాటు పరిసర ప్రాంత ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు, అత్యవసర చికిత్సలు నిరంతరం అందుబాటులో ఉంచుతామని తెలిపారు. రోగులకు నాణ్యమైన చికిత్స అందించడమే లక్ష్యంగా హాస్పిటల్ సేవలు కొనసాగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ శేట్కర్, జిల్లా కాంగ్రెస్ నాయకుడు పట్లోళ్ల సుధాకర్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, వైద్యులు, పట్టణ ప్రముఖులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పరకాల ఎక్సైజ్ స్టేషన్‌లో వాహనాల వేలం



**చట్టం /పరకాల ;** పరకాల పట్టణంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో సీజ్ చేసిన వాహనాలకు వేలం నిర్వహించనున్నట్లు పరకాల ఎక్సైజ్ సీఐ పి. తాతాజీ తెలిపారు. వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి వరంగల్ రూరల్ ఆదేశాల మేరకు ఈ నెల 25న ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేలంలో పాల్గొనదలచిన ఆసక్తిగల వ్యక్తులు పరకాల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో వాహనాల అప్‌సెట్ ధరలో 50 శాతం మొత్తాన్ని డిపాజిట్‌గా చెల్లించి పాల్గొనవచ్చని సీఐ తాతాజీ తెలిపారు. వేలానికి సంబంధించిన మరిన్ని వివరాలను ఎక్సైజ్ స్టేషన్‌లో తెలుసుకోవచ్చని సూచించారు.

## అర్వింద్ ది సంస్కారం లేని రాజకీయం ధర్మపురి సంజయ్



**చట్టం ప్రతినిధి కామారెడ్డి ;** గౌరవప్రదమైన ఎంపీ పదవిలో ఉన్న అర్వింద్ ధర్మపురి తన స్థాయికి తగ్గట్లుగా మాట్లాడటం లేదని, సంస్కారం లేని రాజకీయాలు చేస్తున్నారని ఆయన సొంత అన్న, నిజామాబాద్ తొలి మేయర్, కాంగ్రెస్ నేత సంజయ్ ధర్మపురి అన్నారు. ఆదివారం నిజామాబాద్ లోని ఆయన నివాసంలో సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఎంపీ అర్వింద్పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. నిజామాబాద్ అభివృద్ధిని వదిలేసి, ప్రజలను మోసం చేయడమే కాకుండా, తెలంగాణ సమాజం మెచ్చిన నేత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అహంకారపూరితంగా, అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు సంజయ్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో విమర్శలు విధానపరంగా, ఆరోగ్యకరమైన రాజకీయాలకు అనుగుణంగా ఉండాలని సంజయ్ హితవు పలికారు. సీఎంను బాడీ షేమింగ్ చేస్తూ కించపరచడం, వ్యక్తిగత దూషణలకు దిగడం అర్వింద్ దిగజారుడు రాజకీయాలకు పరాకాష్టగా మారిందన్నారు. అర్వింద్ మాట్లాడే భాషను సొంత పార్టీ నేతలు కూడా సమర్థించడం లేదన్నారు. 'నీతులు చెప్పడం, నికృష్ణ రాజకీయాలు చేయడమే మీ సిద్ధాంతమా' అని ప్రశ్నించారు. అర్వింద్ వ్యవహారాన్ని వాషింగ్ పౌడర్ నిర్మా సిద్ధాంతంగా పేర్కొన్నారు. రాజకీయం చేతకాక వ్యక్తిగత శారీరక ఆకృతిపై మాట్లాడటం సంస్కారహీనతకు నిదర్శనమన్నారు. హైందవ ధర్మం మీకిదే నేర్పుతోందా అంటూ ప్రశ్నించారు. ప్రజాబలంతో గెలిచిన సీఎం రేవంత్ రెడ్డిని ఇంతలా విమర్శించినంత మాత్రాన ఆయన ప్రతిష్ట తగ్గదని సంజయ్ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజారంజకమైన పాలనను చూసి బీజేపీకి ఓటమి భయం పట్టుకుందన్నారు. తెలంగాణ సంస్కృతిలో వ్యక్తిగత దూషణలకు తావు లేదని, తక్షణమే అర్వింద్ ధర్మపురి సీఎం రేవంత్ రెడ్డికి, తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని సంజయ్ ధర్మపురి డిమాండ్ చేశారు.

## కామారెడ్డి జిల్లాలో ట్రాన్స్ఫార్మర్ చోరీ ముఠా గుట్టురట్టు మరో నిందితుడు అరెస్ట్




**చట్టం ప్రతినిధి కామారెడ్డి ;** కామారెడ్డి జిల్లా మద్నూర్ పోలీసుల దర్యాప్తులో ట్రాన్స్ఫార్మర్ చోరీలకు పాల్పడుతున్న ముఠా గుట్టురట్టైంది. ఈ కేసులో మరో నిందితుడు భీమ్రావును పోలీసులు అరెస్ట్ చేశారు. ఇప్పటికే నలుగురిని అదుపులోకి తీసుకోగా, తాజా అరెస్టుతో మొత్తం ఐదుగురు నిందితులు పోలీసుల అదుపులోకి వచ్చారు. కామారెడ్డి జిల్లా మద్నూర్ పోలీసుల దర్యాప్తులో ట్రాన్స్ఫార్మర్ చోరీలకు పాల్పడుతున్న ముఠా గుట్టురట్టైంది. ఈ కేసులో మరో నిందితుడు భీమ్రావును పోలీసులు అరెస్ట్ చేశారు. ఇప్పటికే ఈ కేసులో నలుగురిని అదుపులోకి తీసుకోగా, తాజా అరెస్టుతో మొత్తం ఐదుగురు నిందితులు పోలీసుల అదుపులోకి వచ్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, అరెస్ట్ అయిన నిందితుడు ఐదు మండలాల పరిధిలో జరిగిన 22 ట్రాన్స్ఫార్మర్ చోరీ కేసుల్లో ప్రమేయం ఉన్నట్లు విచారణలో తేలింది. ఈ చోరీలకు పాల్పడటానికి ఉపయోగించిన పనిముట్లు, ఒక కత్తి, ఒక మోటార్సైకిల్తో పాటు రూ.2,000 నగదును నిందితుడి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఈ ట్రాన్స్ఫార్మర్ చోరీ కేసులను ఛేదించి, నిందితులను అరెస్ట్ చేసిన పోలీసు బృందాన్ని జిల్లా ఎస్పీ అభినందించారు. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

## జర్నలిస్టు కాలనీకి మౌలిక సదుపాయాలు త్వరలో కల్పిస్తాం



- ప్రజా పాలన ప్రభుత్వంలో జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉంటాం
- మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు

చట్టం న్యూస్ వేములవాడ రూరల్ : వేములవాడ జర్నలిస్టు కాలనీలో మౌలిక సదుపాయాలను త్వరలోనే కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అన్నారు. ఆదివారం మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, ఆరో వార్డు కౌన్సిలర్ కాస శ్రీనివాసులతో కలిసి నాంపల్లి శివారులోని జర్నలిస్టు కాలనీని వారు సందర్శించారు. వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని ఆరో వార్డులో, నాంపల్లి శివారులో 391 సర్వే నంబర్‌లో ప్రభుత్వం జర్నలిస్టులకు నివేశన స్థలాలను కేటాయించిన విషయం తెలిసిందే. గత మూడేళ్లుగా పలువురు జర్నలిస్టులు కాలనీలో ఇళ్ల నిర్మాణాలను చేపడుతున్నారు. అయితే విద్యుత్, డ్రైనేజీ, తాగునీరు,రోడ్లు తదితర మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి జర్నలిస్టులు తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జర్నలిస్టు కాలనీని సందర్శించి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్‌ను ఆదేశించారు. ఈ నేపథ్యంలో కాలనీని సందర్శించిన పుల్కం రాజు మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా నిలుస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చే జర్నలిస్టుల కాలనీలో అవసరమైన మౌలిక సదుపాయాలను తక్షణమే కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వైస్ చైర్మన్ నరాల శేఖర్, ఆరో వార్డు కౌన్సిలర్ కాస శ్రీనివాసులు మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిశీలించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజె రాష్ట్ర ఉపాధ్యక్షులు మాట్లాడుతూ గత ప్రభుత్వం జర్నలిస్టులకు నివేశన స్థలాలను కేటాయించిందని, ప్రస్తుత ప్రభుత్వం కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల నివేశన స్థలాల సమస్యలను కూడా పరిష్కరించాలని కోరారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, కౌన్సిలర్ కాస శ్రీనివాసులను ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రాపల్లి శ్రీనివాస్ శాలువాలతో సత్కరించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జర్నలిస్టు కాలనీకి చెందిన పలువురు విలేకరులు పాల్గొన్నారు.

## అక్షర యోధులు దాశరథి రంగాచార్య



సాహితీవేత్త, అక్షర యోధులు నా తెలంగాణ కోటి రతనాల వీణ అంటూ నినదించిన కృష్ణ మా చార్యుల సోదరుడు దాశరథి రంగాచార్యదాశరథి రంగాచార్యులు 1928, ఆగస్టు 24 న మహబూబాబాదు జిల్లా, చిన్నగూడూర్ మండలంలో జన్మించారు. ఆయన సోదరులు కవి, సాయుధపోరాట యోధుడు దాశరథి కృష్ణమాచార్యులు. తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. సాయుధపోరాట కాలంలో ఉపాధ్యాయునిగా, గ్రంథపాలకునిగా పనిచేశారు. సాయుధపోరాటం ముగిసాకా సికిందరాబాద్ పురపాలక కార్పోరేషన్‌లో 32 ఏళ్ళు పనిచేసి ఉద్యోగవిరమణ చేశారు. నైజాం రాజ్యంలో నిజాం పాలన కాలంలో జన్మించిన దాశరథి రంగాచార్య ఎదుగుతూండగా ఆంధ్రమహాసభ, ఆర్య సమాజాలు వేర్వేరుగా నిజాం పాలనలోని లోపాలను ఎదుర్కొంటున్న తీరుకు ఆకర్షితులయ్యారు. తండ్రి సనాతనవాది ఐనా అన్నగారు ప్రఖ్యాత కవి, అభ్యుదయవాది కృష్ణమాచార్యుల సాంగత్యంలో అభ్యుదయ భావాలను, విప్లవ భావాలను అలవర్చుకున్నారు. అసమానతలకు, అణచివేతకు నిలయంగా మారిన నాటి నైజాం సమాజాన్ని గమనించి పెరిగిన రంగాచార్యులు 1945ల్లో ప్రారంభమైన తెలంగాణ సాయుధ పోరాటంలో క్రియాశీలకమైన పాత్ర పోషించారు. తండ్రి కుటుంబ కలహాల్లో భాగంగా తల్లినీ, తమనూ వదిలివేయడంతో అన్నతో పాటుగా ఉంటున్న రంగాచార్యులకు ఆపై సాయుధ పోరాటంలో కృష్ణమాచార్యులను అరెస్టు చేయడంతో చిన్న ప్రాయం ముగిసేలోపే కుటుంబ బాధ్యతలు స్వీకరించాల్సి వచ్చింది. కుటుంబ బాధ్యతల కారణంగా గ్రంథపాలకునిగా, ఉపాధ్యాయునిగా పనిచేస్తూనే ఆనాటి సమాజంలో అసమానతల గురించి ప్రజలను చైతన్యపరిచారు. ఆ క్రమంలో రంగాచార్యుల కుటుంబంపై నైజాం ప్రభుత్వ అనుకూలురు, భాగస్వాములు దాడిచేసినా వెనుదీయలేదు. పోరాటం కీలకదశకు చేరుకున్న కాలానికిలో చేరి సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. ఈ క్రమంలో రంగాచార్యులు తుపాకీ బుల్లెట్టు దెబ్బ తప్పించుకుని ప్రాణాపాయాన్ని కూడా ఎదుర్కొన్నారు.తెలంగాణా సాయుధ పోరాటం నాటి స్థితిగతులు, ఆ కాలంలోని దారుణమైన బానిస పద్ధతులను దాశరథి రంగాచార్యులు చిల్లర దేవుళ్ళు, మోదుగుపూలు, జనపదం నవలల్లో చిత్రీకరించారు. చిల్లర దేవుళ్లు నవలలో సాయుధపోరాటం ముందు స్థితిగతులు, మోదుగుపూలు నవలలో తెలంగాణ సాయుధ పోరాటకాలం నాటి పరిస్థితులు, అనంతర పరిస్థితులు "జనపదం"లో అక్షరీకరించారు.వట్టికోట ఆళ్వారుస్వామి ప్రజల మనిషి, గంగు వంటి నవలల ద్వారా నాటి జీవన చిత్రణ చేయాలనే ప్రయత్నం ప్రారంభించారు. ఆ నవలల ప్రణాళిక పూర్తి కాకుండానే ఆళ్వారు స్వామి మరణించారు. సాయుధపోరాట యోధులుగా, సాహిత్యవేత్తలుగా ఆళ్వారు స్వామికీ, రంగాచార్యులకూ సాన్నిహిత్యం ఉండేది. దాశరథి రంగాచార్యులు రాసిన "చిల్లర దేవుళ్లు" నవల సినిమాగా తీశారు. టి.మాదవరావు దర్శకత్వంలో నిర్మించిన చిల్లర దేవుళ్లు ఈ చిత్రం ఘనవిజయం సాధించింది. పలు భాషలలోకి అనువాదమైంది. రేడియో నాటకంగా ప్రసారమై బహుళప్రాచుర్యం పొందింది. దాశరథి రంగాచార్యులు విశిష్టమైన సాహిత్యాన్ని సృష్టించి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. తెలంగాణ పోరాట క్రమానికి నవలల రూపం కల్పించడం, తెలంగాణ ప్రాంత చారిత్రిక, సామాజిక, రాజకీయ పరిణామాలకు ప్రతిబింబంగా రచించిన ఆత్మకథ జీవనయానం వంటివి సాహిత్యంపై చెరగని ముద్ర వేశాయి. వేదం లిపిబద్ధం కారాదనే నిబంధనలు ఉండగా ఏకంగా తెలుగులోకి అనువదించడం వంటి విప్లవాత్మకమైన పనులు చేపట్టారు. తెలుగులోకి వేదాలను అనువదించిన వ్యక్తిగా ఆయన సాహిత్యచరిత్రలో స్థానం సంపాదించుకున్నారు. దాశరథి రంగాచార్యుల "చిల్లర దేవుళ్లు" నవలకు ఆంధ్ర సాహిత్య అకాడెమీ పురస్కారం పొందారు. వేదాలను అనువదించి, మహాభారతాన్ని సులభవచనంగా రచించినందు వల్ల రంగాచార్యులను, "అభినవ వ్యాసుడు" బిరుదు ప్రదానం చేశారు. 211 1994న ఖమ్మంలో సాహితీ హారతి ఆధ్వర్యంలో వెండి కిరీటాన్ని పెట్టి రంగాచార్యులు దంపతులకు సత్కరించారు. వేదానువాదం, ఇతర విశిష్ట గ్రంథాల రచన సమయంలో దాశరథి రంగాచార్యులకు విశేషమైన సత్కారాలు, సన్మానాలు జరిగాయి. 1990లో ఆంధ్ర ప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం, గుంటూరు జిలాశాఖ వారిచే అమరజీవి పులుపుల వెంకటశివయ్య సాహితీ సత్కారం జరిగుంది 2000లో తెలుగు విశ్వ విద్యాలయం నుండి సాహిత్యలో విశిష్ట పురస్కారం వరించింది దాశరథి 2015, జూన్ 8 కన్నుమూశారు. ప్రతి కవి రచయిత వీరిని స్ఫూర్తిగా తీసుకుని రచనలు చెయ్యాలి వీరు పుట్టిన మహబూబాద్ జిల్లాకు దాశరథి జిల్లాగా పేరు పెట్టాలి వీరి జయంతి ని గ్రామ గ్రామాన నిర్వహించు కుందాం

**కామిడి సతీష్ రెడ్డి జయశంకర్ భూపాల్ పల్లి జిల్లా**
**ఆగస్ట్ 24 న కవి రచయిత దాశరది రంగా చార్య జయంతి సందర్భంగా**

# వికారాబాద్ ప్రైవేట్ ఆసుపత్రుల్లో ప్రాణాల విలువ ఎంత

- **వైద్య నిర్లక్ష్య ఆరోపణలపై విచారణ ఎక్కడ?**
- **డీఎంహెచ్ఓ కార్యాలయంలో మరణాల లెక్క ఉందా?**
- **జిల్లా యంత్రాంగం స్పందించాలని ప్రజల డిమాండ్**



**చట్టం, వికారాబాద్ ప్రతినిధి :** వైద్యం అంటే ప్రాణాన్ని కాపాడే వృత్తి. ఆసుపత్రి గడప తొక్కే ప్రతి రోగి వైద్యులపై నమ్మకంతోనే చికిత్సకు వస్తాడు. అయితే చికిత్స కోసం వచ్చిన వ్యక్తి మృతదేహంగా బయటకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడితే కుటుంబ సభ్యుల్లో అనేక అనుమానాలు తలెత్తడం సహజం. మరణానికి వైద్య నిర్లక్ష్యమే కారణమని బంధువులు ఆరోపించిన సందర్భాల్లో నిజానిజాలు వెలికితీసేందుకు నిష్పక్షపాత విచారణ జరగాల్సిన అవసరం ఉంది. వికారాబాద్ పట్టణంలోని కొన్ని ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఇటీవల జరిగిన మరణాలపై బాధిత కుటుంబాల నుంచి వైద్య నిర్లక్ష్య ఆరోపణలు రావడం చర్చనీయాంశంగా మారింది. అయితే ప్రతి మరణాన్ని వైద్య నిర్లక్ష్యంగా భావించడం సరికాదు. అదే సమయంలో కుటుంబ సభ్యులు తీవ్రమైన ఆరోపణలు చేసిన ఘటనలను విచారణ లేకుండా వదిలేయడం కూడా ప్రజల్లో అనుమానాలకు దారితీస్తోంది. 2026 ఆగస్టులో వికారాబాద్‌లోని మెడిక్యూర్ ఆసుపత్రిలో చేవెళ్ల మండలం ఆలూరుకు చెందిన 33 ఏళ్ల ఏఆర్ కానిస్టేబుల్ నరేష్ మృతి ఘటనపై కుటుంబ సభ్యులు వైద్యుల నిర్లక్ష్య ఆరోపణలు చేసినట్లు వార్తా కథనాలు వెలువడ్డాయి. ఛాతిలో మంటతో ఆసుపత్రికి తీసుకువచ్చిన నరేష్‌కు చికిత్స అనంతరం డిశ్చార్జ్ చేసినట్లు, ఇంటికి వెళ్తున్న సమయంలో కుప్పకూలి మరణించినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారని కథనాలు తెలిపాయి. ఈ ఘటనలో రోగికి ఏ పరీక్షలు నిర్వహించారు? గుండె సంబంధిత అత్యవసర పరిస్థితిని గుర్తించేందుకు అవసరమైన పరీక్షలు చేశారా? డిశ్చార్జ్ నిర్ణయం ఏ వైద్య ప్రమాణాల ఆధారంగా తీసుకున్నారు? అనే ప్రశ్నలకు అధికారిక వైద్య విచారణ ద్వారానే స్పష్టత రావాల్సి ఉంది. 2026 జూన్‌లో వికారాబాద్‌లోని మహావీర్ ఆసుపత్రిలో చిన్నారి మృతి ఘటనపైనా తల్లిదండ్రులు వైద్య నిర్లక్ష్య ఆరోపణలు చేసినట్లు వార్తలు వచ్చాయి. సీనియర్ వైద్యులు ప్రత్యక్షంగా అందుబాటులో లేకుండా జూనియర్ వైద్యులు ఫోన్ ద్వారా సూచనలు తీసుకొని చికిత్స చేశారని కుటుంబ సభ్యులు ఆరోపించినట్లు కథనాలు పేర్కొన్నాయి. మరో చిన్నారి మృతిపైనా కుటుంబ సభ్యుల నుంచి ఆరోపణలు వచ్చినట్లు వార్తలు వెలువడ్డాయి. ఒకే ఆసుపత్రిపై వరుసగా ఆరోపణలు వస్తే జిల్లా వైద్యారోగ్య శాఖ వైద్య రికార్డులను పరిశీలించిందా? చికిత్స చేసిన వైద్యుల అర్హతలను తనిఖీ చేసిందా? పిల్లల అత్యవసర చికిత్సకు అవసరమైన సదుపాయాలు ఉన్నాయా? సీనియర్ వైద్యుల అందుబాటుకు సంబంధించిన నిబంధనలు పాటిస్తున్నారా? అనే అంశాలపై ప్రజలకు స్పష్టత అవసరం. వైద్య నిర్లక్ష్య ఆరోపణలు వచ్చిన ప్రతి ఘటనలో కేస్‌షీట్, ట్రీట్‌మెంట్ చార్ట్, పరీక్షల నివేదికలు, మందుల వివరాలు, డాక్టర్ నోట్స్, డిశ్చార్జ్ సమ్మరీ, డెత్ సమ్మరీలను నిపుణులతో పరిశీలించాల్సిన అవసరం ఉంది. అవసరమైతే ప్రత్యేక వైద్య కమిటీ ఏర్పాటు చేసి నివేదికను ప్రజలకు వెల్లడించాలి. నిర్లక్ష్యం తేలితే చర్యలు తీసుకోవాలి. ఆరోపణలు నిరాధారమని తేలితే ఆ విషయాన్ని కూడా స్పష్టంగా ప్రకటించాలి.

**డీఎంహెచ్ఓ కార్యాలయంలో లెక్క ఉందా?**

వికారాబాద్ పట్టణంలో మొత్తం ప్రైవేట్ ఆసుపత్రులు ఎన్ని? వాటిలో చట్టబద్ధంగా రిజిస్టర్ అయినవి ఎన్ని? గత ఐదేళ్లలో ఆయా ఆసుపత్రుల్లో ఎంతమంది ఇన్‌పేషెంట్లుగా చేరారు? చికిత్స పొందుతూ ఎంతమంది మృతి చెందారు? మరణాలపై కుటుంబ సభ్యుల నుంచి ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి? ఎన్ని ఫిర్యాదులపై విచారణ జరిగింది? ఎన్ని ఆసుపత్రులకు నోటీసులు జారీ చేశారు? ఎన్ని కేసుల్లో వైద్య నిర్లక్ష్యం నిర్ధారణ అయింది? ఎన్ని ఆరోపణలు నిరాధారమని తేలాయి? అనే వివరాలను జిల్లా వైద్యారోగ్య శాఖ వెల్లడించాలని ప్రజలు కోరుతున్నారు. 2022లో వికారాబాద్ జిల్లాలో 21 ఆసుపత్రులు, డయాగ్నోస్టిక్ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించి కొన్ని సంస్థలకు జరిమానాలు, మరికొన్నింటికి నోటీసులు జారీ చేసినట్లు అప్పటి వార్తా కథనాలు పేర్కొన్నాయి. దీంతో తనిఖీల వ్యవస్థ ఉన్నప్పటికీ అవి నిరంతరం జరుగుతున్నాయా? ఘటన జరిగిన తర్వాత మాత్రమే అధికారులు కదులుతున్నారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**ప్రజాప్రతినిధులు స్పందించాలి**

వికారాబాద్ జిల్లా కేంద్రానికి పూడూరు, నవాబుపేట, ధారూరు, బంట్వారం, మోమిన్‌పేట, తాండూరు, పరిగి, చేవెళ్ల పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు వైద్యం కోసం వస్తుంటారు. అందువల్ల జిల్లా కేంద్రంలోని ఆసుపత్రులపై ప్రజలకు పూర్తి నమ్మకం ఉండాల్సిన అవసరం ఉంది. ప్రైవేట్ ఆసుపత్రుల్లో అత్యవసర వైద్య సేవలు, డాక్టర్ల అందుబాటు, ICU సదుపాయాలు, అంబులెన్స్ సేవలు, అవసరమైన వైద్య పరికరాలపై జిల్లా స్థాయి సమీక్ష నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. వైద్య నిర్లక్ష్య ఆరోపణలు వచ్చిన కేసులపై ప్రత్యేక నివేదిక తీసుకోవాలని ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.

**ఆసుపత్రి వ్యాపారం కావచ్చు.. ప్రాణం వస్తువు కాదు**

ప్రైవేట్ ఆసుపత్రులు ప్రజలకు అవసరమైన వైద్య సేవలను అందిస్తున్నాయి. అనేక మంది వైద్యులు, నర్సులు, సిబ్బంది నిబద్ధతతో సేవలు చేస్తున్నారు. అయితే అధిక బిల్లులు, అవసరం లేని పరీక్షలు, చికిత్సలో ఆలస్యం, సీనియర్ వైద్యుల అందుబాటు లేకపోవడం, చివరి దశలో ఇతర ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారనే ఆరోపణలు వచ్చినప్పుడు వాటిపై ప్రభుత్వం విచారణ జరపాల్సిన బాధ్యత ఉంది. వైద్య నిర్లక్ష్య ఆరోపణలపై బాధిత కుటుంబాలతో రాజీ కుదిరిన సందర్భాల్లో కూడా వైద్యపరమైన విచారణ కొనసాగాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆర్థిక పరిహారం చెల్లించినంత మాత్రాన మరణానికి కారణం ఏమిటనే వైద్యపరమైన ప్రశ్నకు సమాధానం దొరకదు.

**సమగ్ర ప్రైవేట్ హాస్పిటల్ ఆడిట్ అవసరం**

వికారాబాద్ జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులపై సమగ్ర ఆడిట్ నిర్వహించాలని ప్రజల నుంచి డిమాండ్ వినిపిస్తోంది. ఆసుపత్రుల్లో పనిచేస్తున్న వైద్యుల అర్హతలు, సిబ్బంది సంఖ్య, అత్యవసర వైద్య సదుపాయాలు, ICU సామర్థ్యం, వెంటిలేటర్లు, ఆక్సిజన్ సదుపాయం, 24 గంటల డాక్టర్ అందుబాటు, ల్యాబ్, ఫార్మసీ, అంబులెన్స్ సేవలు, చికిత్స ఛార్జీలు, మరణాల రికార్డులు, ఫిర్యాదులు, విచారణలు, తీసుకున్న చర్యలను పరిశీలించాలని కోరుతున్నారు. ప్రతి మరణం వైద్య నిర్లక్ష్యం కాదు. కానీ అనుమానాలు వ్యక్తమైన ప్రతి మరణంపై పారదర్శక విచారణ జరగాలి. బాధిత కుటుంబానికి నిజం తెలియాలి. ఆసుపత్రికి తన వాదన చెప్పే అవకాశం ఇవ్వాలి. తప్పు తేలితే చర్యలు తీసుకోవాలి. తప్పు చేయని ఆసుపత్రులపై ఆరోపణలు కొనసాగకుండా అధికారికంగా స్పష్టత ఇవ్వాలి.

వికారాబాద్ ప్రజలు కోరేది ఆరోపణలు కాదు—నిజం. భయం కాదు—భరోసా. మాటలు కాదు—చర్య. వైద్య నిర్లక్ష్య ఆరోపణలపై డీఎంహెచ్ఓ కార్యాలయం స్పందిస్తుందా? జిల్లా ప్రజాప్రతినిధులు సమీక్ష చేపడతారా? ప్రైవేట్ ఆసుపత్రులపై సమగ్ర తనిఖీలకు జిల్లా యంత్రాంగం సిద్ధమవుతుందా? అనే ప్రశ్నలకు ఇప్పుడు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

# జూలపల్లిలో CASO కార్యక్రమం.. 39 వాహనాలు స్వాధీనం

- **ప్రజా భద్రత, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన**



**చట్టం, పెద్దపల్లి :** పెద్దపల్లి జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జూలపల్లి మండల కేంద్రంలో CASO (Community Awareness and Support Outreach) కార్యక్రమాన్ని జూలపల్లి పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎలిగేడు ఎస్ఐతో పాటు జూలపల్లి పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక సర్పంచ్, సుమారు 60 మంది గ్రామస్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా ట్రాఫిక్, ఇతర నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి 37 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు స్థానికులతో మాట్లాడి ప్రజా భద్రత, యువత సంక్షేమం, నేరాల నివారణ, రోడ్డు భద్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. చెడు అలవాట్లు, గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం వల్ల వ్యక్తులు, కుటుంబాలు, సమాజంపై కలిగే దుష్ప్రభావాలను వివరించారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, దుర్వినియోగం కారణంగా ఎదురయ్యే సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112 సేవలను వినియోగించుకునే విధానాన్ని ప్రజలకు వివరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. గ్రామంలో అసాంఘిక, అనుమానాస్పద, చట్టవిరుద్ధ కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. యువతతో ప్రత్యేకంగా మాట్లాడి వారి రోజువారీ సమస్యలు, భవిష్యత్ కెరీర్ అవకాశాలపై చర్చించారు. చెడు అలవాట్లు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ చదువు, ఉపాధి, కెరీర్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. మహిళలతో మాట్లాడి వారి భద్రత, రోజువారీ సమస్యలు, ఇతర ఇబ్బందులను తెలుసుకున్నారు. అవసరమైన సందర్భాల్లో పోలీసుల సహాయం అందుబాటులో ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రజల చురుకైన భాగస్వామ్యంతో CASO కార్యక్రమం విజయవంతమైందని జూలపల్లి ఎస్సై బి. మల్లేష్ తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలతో పోలీసు-ప్రజల మధ్య సత్సంబంధాలు బలోపేతం కావడంతో పాటు నేరాల నియంత్రణకు సమాజ సహకారం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు.

# వైభవంగా సంతోషిమాత ఆలయ వార్షికోత్సవాలు .. సోమవారం రథోత్సవం



**చట్టం – సిద్దిపేట ప్రతినిధి :** సిద్దిపేట పట్టణంలోని పటేల్‌పూర వీధిలో వెలసిన సంతోషిమాత దేవాలయ 34వ వార్షికోత్సవాలు భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజైన ఆదివారం ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలను వేదోక్తంగా నిర్వహించారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని తిరువీధుల గుండా అమ్మవారి రథోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం కలశ ఉద్వాసన చేపట్టి పవిత్ర జలాలతో ఆలయ ప్రాంగణంతో పాటు భక్తులపై ప్రోక్షణ చేశారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని భక్తులకు మహా అన్నప్రసాద వితరణ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ అభివృద్ధికి, వార్షికోత్సవ వేడుకల నిర్వహణకు ఆర్థికంగా, వస్తురూపేణా సహకరించిన దాతలకు వేద పండితులు ఆశీర్వచనాలు అందజేసి తీర్థప్రసాదాలు అందించారు. ఉత్సవాలను విజయవంతం చేయడంలో సేవలందించిన అర్చకులు, రుత్వికులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి మైసాగౌడ్, అర్చక బృందం పొడిచేటి రామకృష్ణ, శకం మధుసూదన్, ధర్మకర్తల మండలి సభ్యులు సొప్పదండి రాము, చింత సంతోష్ కుమార్, మూటకొండూర్ బ్రహ్మచారి, జిల్లా రజిత, గంప చందర్, రావికంటి జయప్రద, బండి మమత, మాజీ చైర్మన్లు తమ్మిశెట్టి వీరేశం, కాచం కాశినాథ్, డాక్టర్ మాంకాల నవీన్ కుమార్, మాజీ ధర్మకర్తలు గాదగోని సత్యం గౌడ్, కొమరవెల్లి కల్యాణి, గందె మాధురి, గరిపల్లి సువర్ణ, కాముని ప్రభాకర్, ఉత్సవ నిర్వహణ అర్చకులు ఉమాపతి రామేశ్వర శర్మ, ఆలయ సిబ్బంది శంకర్, వాసు, సంతోషిమాత మాతృ మండలి సభ్యులు, స్థానిక భక్తులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# కృషి కళా సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా జానపద కళోత్సవాలు

- **పలువురు కళాకారులకు జానపద పురస్కారాల ప్రదానం**



**చట్టం, రామగుండం :** ప్రపంచ జానపద కళల దినోత్సవాన్ని పురస్కరించుకుని కృషి కల్చరల్ అకాడమీ గోదావరిఖని ఆధ్వర్యంలో జానపద కళోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆర్టీసీ డిపో ఎదుట ఉన్న వెంకటేశ్వర స్వామి కళ్యాణ మండపంలో జరిగిన ఈ వేడుకలకు కృషి కళా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, కోల్ ఇండియా పథకాల విజేత, నటుడు కాసిపాక రాజమౌళి అధ్యక్షత వహించారు. కాసిపాక రాజమౌళి జ్యోతి ప్రజ్వలన చేసి కళోత్సవాలను ప్రారంభించారు. దాదాపు 200 మంది కళాకారులు జానపద పాటలు, జానపద నృత్యాలతో ఆకట్టుకున్నారు. ప్రదర్శనల్లో పాల్గొన్న కళాకారులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. జానపద కళారంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న పలువురు కళాకారులను ప్రత్యేక జానపద పురస్కారాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కాసిపాక రాజమౌళి మాట్లాడుతూ, తమ తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన జానపద కళలను సజీవంగా ఉంచేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సింగరేణి సంస్థ కార్యక్రమాలు, ప్రభుత్వ కార్యక్రమాలు, సామాజిక కార్యక్రమాల్లో జానపద ప్రదర్శనలు ఇస్తూ ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. కనుమరుగవుతున్న జానపద కళారూపాలను భావితరాలకు అందించాలనే లక్ష్యంతోనే ఇటువంటి కళోత్సవాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. వ్యవస్థాపకుడు నిట్టూరి రాజారత్నం స్థాపించిన కళా సంస్థను సభ్యులంతా ఐక్యంగా మరింత ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. సంస్థ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి, కోల్ ఇండియా గోల్డ్ మెడలిస్టు, సింగరేణి ఉద్యోగి కనకం రమణయ్య ప్రాచీన జానపద గీతాలను ఆలపించి సభికులను విశేషంగా ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో గుమ్మడి ఉజ్వల, ఆరెల్లి లక్ష్మీకళ, కనకం శంకర్, చిలుక సమ్మయ్య, పులిపాక బానయ్య, పొనగంటి రాజనర్సు, అమరగాని శ్రీనివాస్, బొమ్మక వంశీ, వడ్డేపల్లి సందీప్, జనగామ రాజనర్సు, మోరె దేవయ్య, శానగొండ రవీందర్, మొలుగూరి సమ్మయ్య, అంబాల రాజయ్య, జాలిగపు రాజు, వడ్లకొండ రవివర్మలను జానపద పురస్కారాలతో ఘనంగా సన్మానించారు. కృషి కళా సంస్థ కళాకారులు బోడకుంట వెంకట్రాజం, అట్ల జగ్గయ్య, జనగామ శ్రీనివాస్, పండుగ రాజేశ్వరరావు, సిరిపురం శ్రీనివాస్, బీరుక లక్ష్మణ్, సమాఖ్య కళాకారులు సోగాల వెంకటి, మాదరి శ్రీనివాస్, నాగుల శ్రీనివాస్, ఓసీపీ3 అడిషనల్ మేనేజర్ పాల నరేష్, బతుకుల రాజన్న, గాజుల రమేష్, యూట్యూబ్ నటుడు వేముల అశోక్, నాట్య గురువులు సర్వేశ్, దేవా, ధర్మేందర్, సురేష్, ప్రశాంత్, విష్ణు, జనగామ పద్మ, సలిగంటి సంపత్ తదితరులు పాల్గొన్నారు. ఈ జానపద కళోత్సవాలను దాదాపు 600 మంది ప్రేక్షకులు హాజరై వీక్షించారు. కళాకారుల ప్రదర్శనలు, జానపద గీతాలు, నృత్యాలతో కళ్యాణ మండపం సందడిగా మారింది.

# 20 ఏళ్ల చీకట్లకు తెర.. బాలాజీ గుట్టపై వెలుగులు

- **చట్టం కథనానికి స్పందన.. ఎమ్మెల్యే రామారావు పటేల్ చొరవతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు**



**చట్టం, తానూర్ :** నిర్మల్ జిల్లా తానూర్ మండలం బోరేగాం గ్రామంలోని బాలాజీ గుట్టపై దాదాపు 20 ఏళ్లుగా నెలకొన్న విద్యుత్ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. "బాలాజీ గుట్టపై చీకటి మయం" అనే శీర్షికతో గ్రామ ప్రజల ఆవేదనను చట్టం దినపత్రిక గత నెలలో వెలుగులోకి తీసుకురాగా, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ స్పందించి విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపట్టారు. బాలాజీ ఆలయానికి విద్యుత్ సరఫరా లేకపోవడంతో భక్తులు, గ్రామస్తులు ఎన్నో ఏళ్లుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల ఎమ్మెల్యే రామారావు పటేల్ బోరేగాం గ్రామానికి వచ్చిన సందర్భంగా ఆలయానికి విద్యుత్ కనెక్షన్ లేక ఎదురవుతున్న సమస్యలను గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో కేవలం మూడు రోజుల వ్యవధిలోనే బాలాజీ గుట్టపై ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను అందుబాటులోకి తీసుకొచ్చారు. రెండు దశాబ్దాలుగా కొనసాగుతున్న సమస్యకు పరిష్కారం లభించడంతో భక్తులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామారావు పటేల్ మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం కారణంగానే బాలాజీ గుట్టకు ఇన్నేళ్లుగా విద్యుత్ సౌకర్యం అందలేదని పేర్కొన్నారు. గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని తెలిపారు. బాలాజీ గుట్టపై విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు చొరవ చూపిన ఎమ్మెల్యే రామారావు పటేల్‌కు, సమస్యను వెలుగులోకి తీసుకొచ్చిన చట్టం దినపత్రిక యాజమాన్యానికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మండల సీనియర్ నాయకులు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# జాతీయ కర్మయోగి అవార్డు గ్రహీత యాదవరాజుకు ఘన సన్మానం



- **యునైటెడ్ ఎన్జీవోస్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో విజయవాడలో రాష్ట్రస్థాయి వర్క్‌షాప్**

**చట్టం, రామగుండం :** జాతీయ కర్మయోగి అవార్డు గ్రహీత, నేషనల్ యూత్ ప్రాజెక్ట్ ఆంధ్రప్రదేశ్-తెలంగాణ అధ్యక్షుడు యాదవరాజును విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. యునైటెడ్ ఎన్జీవోస్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన స్వచ్ఛంద సంస్థల కార్యక్రమాలపై ఒకరోజు రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి యునైటెడ్ ఎన్జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పు రాంబాబు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ గౌడ కార్పొరేషన్ చైర్మన్, కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గురుమూర్తి, వాసవి ఇంటర్నేషనల్ విజయవాడ అధ్యక్షుడు ఆశయ్య గుప్తా, కోఆర్డినేటర్ నాగరాజు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జాతీయ కర్మయోగి అవార్డు అందుకున్న యాదవరాజును విశిష్ట అతిథిగా ఆహ్వానించి సత్కరించారు. గత 35 సంవత్సరాలుగా సామాజిక కార్యకర్తగా దేశంలోని పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో పాటు పొరుగు దేశాల్లోనూ వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు వక్తలు తెలిపారు. యువత, పాఠశాల విద్యార్థులు, కళాశాల విద్యార్థులకు స్వామి వివేకానంద, మహాత్మా గాంధీతో పాటు పలువురు మహనీయుల జీవిత సందేశాలను పరిచయం చేస్తూ వారిని సన్మార్గంలో నడిపించేందుకు యాదవరాజు నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. యువతను సామాజిక సేవ వైపు ప్రోత్సహించడంలో ఆయన పాత్ర ప్రశంసనీయమని అన్నారు. వరదలు, భూకంపాలు, ప్రకృతి వైపరీత్యాలు, కరోనా సమయంలో బాధితులకు సహాయం అందించడంలో యాదవరాజు ముందుండారని వక్తలు గుర్తు చేశారు. రక్తదాన శిబిరాల నిర్వహణ, మాస్కులు, శానిటైజర్లు, బియ్యం, నిత్యావసర సరుకులు, కూరగాయలు, మందుల పంపిణీ ద్వారా అనేక మందికి చేయూతనిచ్చారని తెలిపారు. బడుగు, బలహీన వర్గాల సమస్యలపై స్పందిస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమాలు, పాదయాత్రల్లో పాల్గొన్నారని తెలిపారు. జల్-జమీన్-జంగల్, జనదేశ్-2007, జనసత్యాగ్రహ్-2012, జనాందోళన్-2018 వంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నట్లు పేర్కొన్నారు. దేశ సమైక్యత, అహింస, శాంతి సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు వాహన యాత్ర చేపట్టినట్లు వివరించారు. ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల కార్యక్రమాల్లో రిసోర్స్ పర్సన్‌గా, కళాకారుడిగా, మోటివేటర్‌గా, ఉపాధ్యాయుడిగా, సామాజిక సందేశకుడిగా యాదవరాజు సేవలు అందిస్తున్నారని వక్తలు కొనియాడారు. జాతీయ కర్మయోగి అవార్డు మాత్రమే కాకుండా అనేక పురస్కారాలు ఆయన సేవలకు గుర్తింపుగా లభించాయని తెలిపారు. యాదవరాజు సేవా ప్రయాణం నేటి యువతకు ఆదర్శమని, సమాజాభివృద్ధి కోసం యువత ఆయన స్ఫూర్తితో ముందుకు సాగాలని కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు పిలుపునిచ్చారు.

# మాల జాతి పరిరక్షణకు ఏకం కావాలి

- **ఎంసిఎఫ్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ గోపీనాథ్**




**చట్టం ఆర్మూర్:** మాల జాతి పరిరక్షణకు మాలలందరూ ఏకం కావాలని మాల కోఆర్డినేషన్ ఫోరమ్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్ పిలుపునిచ్చారు. మాలల రోస్టర్ పాయింట్ సవరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం రోజు ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని ఎంఎస్ ఫంక్షన్ హాల్ లో మాల కోఆర్డినేషన్ ఫోరమ్ జిల్లా కన్వీనర్ డి లింగన్న అధ్యక్షతన జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన గోపీనాథ్, మాట్లాడుతూ సుప్రీం కోర్ట్ తీర్పు భిన్నంగా వర్గీకరణ చేశారని తెలిపారు. అశాస్త్రియమైన వర్గీకరణ వల్ల మాలలకు విద్య ఉద్యోగ నియామకాలలో రోస్టర్ పాయింట్ ను 22 కేటాయించడంతో భవిష్యత్తులో మాల విద్యార్థి నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇక రావని పేర్కొన్నారు. రోస్టర్ పాయింట్ సవరించే వరకు మాలలు ఐక్యంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మహాత్మ జ్యోతిరావు పూలే మహనీయుల స్ఫూర్తితో ఉద్యమించాలని కోరారు. మాల కోఆర్డినేషన్ రాష్ట్ర నాయకులు పి.శంకర్ మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా నింద ఆరోపణలు దోపిడిదారులని మాలలపై ముద్ర వేసిన మౌనంగా ఉండటం వల్లే చారిత్రాత్మక అన్యాయం జరిగిందని చెప్పారు. వర్గీకరణలో మాలలకు సామాజిక న్యాయం దక్కడం లేదన్నారు. నిద్రమత్తు నుండి మాలలు మేల్కొని తమ పిల్లలకు భవిష్యత్తు కోసం త్యాగాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మాల కోఆర్డినేషన్ ఫోరం రాష్ట్ర నాయకులు శకుంతల మాట్లాడుతూ మాలల న్యాయమైన పోరాటంలో మహిళలను భాగస్వాములు చేయాలని కోరారు. సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా వర్గీకరణ జరిగిందని తెలిపారు. మాల కోఆర్డినేషన్ ఫోరం రాష్ట్ర నాయకులు తిరుపతయ్య మాట్లాడుతూ భారత రాజ్యాంగం, సుప్రీం కోర్టు తీర్పుకు విరుద్ధంగా వర్గీకరణ చేసి మాలలను నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశం ప్రారంభంకు ముందు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం భారత రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేశారు. శనివారం నాడు మరణించిన ఎంసిఎఫ్ రాష్ట్ర నాయకులు రిటైర్డ్ బిసి వెల్ఫేర్ అధికారి బాలచందర్, మరణానికి సూచికగా మౌనం పాటించి సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మాల కోఆర్డినేషన్ ఫోరమ్ జిల్లా కన్వీనర్ డి. లింగన్న, జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రాజన్న, వివిధ సంఘాల నాయకులు ప్రతి రవీంద్ర, సామ్రాట్, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

- **ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి**
- **కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న బాసర పోలీసులు**



**చట్టం, బాసర :** నిర్మల్ జిల్లా బాసర మండల పరిధిలో గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఓని గ్రామానికి చెందిన గొట్టుముక్కుల సాయిలు (48) శనివారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో గోదావరి నది సమీపంలో ఉండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాయిలు తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాద విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో, బాసరలోని ఓ ప్రైవేటు అతిథి గృహంలో పనిచేస్తున్న కుమారుడు జ్ఞానేశ్వర్ ఘటనాస్థలికి చేరుకున్నాడు. తీవ్రంగా గాయపడిన సాయిలును చికిత్స నిమిత్తం భైంసా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఆసుపత్రికి చేరుకున్న అనంతరం వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై సాయిలు కుమారుడు జ్ఞానేశ్వర్ బాసర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు బాసర ఎస్‌హెచ్ఓ దీపక్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన వాహనానికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. సాయిలు గత ఎనిమిదేళ్లుగా బాసర శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయ పరిసరాల్లోని హోటళ్లలో చిన్నచిన్న పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరితో కలిసిమెలిసి ఉండే వ్యక్తిగా గ్రామస్తుల అభిమానాన్ని పొందాడని పేర్కొన్నారు. పేద కుటుంబానికి చెందిన సాయిలు చిన్ననాటి నుంచే కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించాడు. కూతురు వివాహం చేయడంతో పాటు ఇద్దరు కుమారులను చదివించి ప్రయోజకులను చేశాడని కుటుంబ సభ్యులు తెలిపారు. పండరీపురం మాల ధరించి పలు దేవాలయాలను దర్శించుకునే భక్తుడిగా కూడా స్థానికులకు సుపరిచితుడని చెప్పారు. సాయిలు ఆకస్మిక మరణంతో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. అందరితో ఆప్యాయంగా మెలిగే మంచి వ్యక్తిని కోల్పోయామని గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు.

# గుడిసెలేని గ్రామాలే ప్రభుత్వ లక్ష్యం



**చట్టం ప్రతినిధి కామారెడ్డి ;** గుడిసెలేని గ్రామాలే ప్రభుత్వ లక్ష్యమని బిక్కనూర్ పట్టణ సర్పంచ్ బల్యాల రేఖా సుదర్శన్ అన్నారు. ఆదివారం పట్టణంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి, లబ్ధిదారులకు కొత్త దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పట్టణంలో ఇళ్లు లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎవరికి ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రతి కుటుంబం సంతోషంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సిద్ధిరామేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ లింబాద్రి, మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదర్శన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దయాకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి రాజబాబు గౌడ్, సొసైటీ అధ్యక్షుడు భూమయ్య, నాయకులు మైపాల్ రెడ్డి, రామచంద్రం, జనార్దన్ రెడ్డి, సాయిలు, మద్దూరి రవి, సిద్ధిరాములు, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆటో కార్మికులు సమ్మెను వెనక్కి తీసుకోవాలి

**చట్టం ;** ఆటో కార్మికులు సమ్మెను వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. సమ్మె ద్వారా సమస్యలు పరిష్కారం కావని తెలిపారు. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. ఆటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. డీజిల్, పెట్రోల్ ఆటోలను రేటిరోఫిట్మెంట్ చేసుకోవడానికి రూ.1.50 లక్షలు ఆర్థిక సహాయం చేయడానికి కొత్త పథకం తీసుకొస్తున్నామని అన్నారు. 2012 తర్వాత ఆటో చార్జీలను పెంచలేదని తెలిపారు. పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు, వాహనాల ధరలు, నిర్వహణ ఖర్చులను పరిగణనలోకి తీసుకుని ఆటో చార్జీల పెంపుపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. కమిటీలో ఆటో కార్మికుల ప్రతినిధులు, రవాణా శాఖ అధికారులు, సంబంధిత వర్గాలను భాగస్వామ్యం చేసి, అన్ని అంశాలపై సమగ్రంగా చర్చించి న్యాయమైన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఆటో కార్మికుల సంక్షేమం కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుందని పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇందుకు అవసరమైన విధివిధానాలు రూపొందించి బోర్డును ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఆటో కార్మికుల సమస్యలను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుందని తెలిపారు.

## ప్రజా సంక్షేమమే ధ్యేయం
## చంద్రుగొండ పర్యటనలో పేర్కొన్న ఎమ్మెల్యే జారే




**చట్టం అశ్వారావుపేట :** చంద్రుగొండ మండల పరిధిలోని గుర్వాయిగూడెం, రావికంపాడు గ్రామాలలో అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ విస్తృతంగా పర్యటించారు. గుర్వాయిగూడెం గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తి కాబడి నిర్వహించిన గృహప్రవేశ మహోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం రావికంపాడు గ్రామంలో అత్యంత వైభవంగా నిర్వహించిన గ్రామ దేవతల బోనాల ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇదే గ్రామానికి చెందిన పాయం మాధవి నూతన గృహప్రవేశ కార్యక్రమానికి హాజరై కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు అందించారు. పర్యటనలో భాగంగా ఇటీవల హైదరాబాద్ ఎన్ఐఎంఎస్ హాస్పిటల్‌లో చికిత్స పొంది నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న రామిశెట్టి నరసింహ స్వామిని, అలాగే చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి పొందుతున్న షేక్ అమీర్ ని వారి నివాసాలకు వెళ్లి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని స్వయంగా అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ధైర్యం చెప్పారు. అలాగే ఇటీవల కాంగ్రెస్ పార్టీ గ్రామ సేవాదళ్ అధ్యక్షులు రేఖం నరేష్ మాతృమూర్తి దివంగత రేఖాం కాంతమ్మ మృతి చెందిన సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తన గాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, సంక్షేమానికి తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, ప్రజల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రోస్టర్ పాయింట్ల కేటాయింపులో మాలలకు అన్యాయం

**ఎంసీఎఫ్.. రోస్టర్ విధానాన్ని పునఃసమీక్షించి సవరించాలని డాక్టర్ ఎంఎస్ గోపీనాథ్ డిమాండ్**




**చట్టం, నిర్మల్ ప్రతినిధి :** ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, పదోన్నతుల్లో అమలు చేస్తున్న ప్రస్తుత రోస్టర్ విధానం వల్ల మాల సామాజిక వర్గానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని, రోస్టర్ పాయింట్ల కేటాయింపును తక్షణమే పునఃసమీక్షించి సవరించాలని రాష్ట్ర మాల కోఆర్డినేషన్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఎంఎస్ గోపీనాథ్ డిమాండ్ చేశారు.నిర్మల్ పట్టణంలోని టీఎన్జీవో భవన్‌లో మాల కోఆర్డినేషన్ ఫోరం జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన గోపీనాథ్ మాట్లాడుతూ, ప్రస్తుత రోస్టర్ పాయింట్ల సీరియల్ క్రమం కారణంగా అర్హత, ప్రతిభ ఉన్న మాల సామాజిక వర్గానికి చెందిన ఉద్యోగార్థులకు సముచిత ప్రాతినిధ్యం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, పదోన్నతుల విషయంలో రోస్టర్ అమలు తీరుపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ నేపథ్యంలో మాల సామాజిక వర్గం ఉద్యోగ అవకాశాల్లో నష్టపోతున్నదని ఆరోపించారు. రోస్టర్ విధానంలో అవసరమైన మార్పులు తీసుకువచ్చి సామాజిక న్యాయం కల్పించే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. రోస్టర్ పాయింట్ల పునర్వ్యవస్థీకరణ చేపట్టి, ఎస్సీ వర్గీకరణలో మాల సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం తగ్గేలా ఉన్న లోపాలను సరిదిద్దాలని డిమాండ్ చేశారు. జనాభా నిష్పత్తి, రాజ్యాంగబద్ధమైన హక్కులను పరిగణనలోకి తీసుకుని రోస్టర్ చార్ట్‌ను సవరించాలని కోరారు. రోస్టర్ విధానంలోని లోపాలను అధ్యయనం చేసేందుకు రిటైర్డ్ న్యాయమూర్తి లేదా నిపుణులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. తమకు న్యాయంగా రావాల్సిన వాటా అందించకపోతే జిల్లా స్థాయి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అవసరమైతే దేశ రాజధాని ఢిల్లీలోనూ ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. ఈ అంశంపై త్వరలో సంబంధిత మంత్రులు, అధికారులకు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమ కార్యాచరణ చేపడతామని వెల్లడించారు. ఈ సమావేశంలో హ్యూమన్ రైట్స్ నాయకుడు శంకర్, నాయకురాలు శకుంతల, మాల కోఆర్డినేషన్ ఫోరం నిర్మల్ జిల్లా కమిటీ సభ్యులు వెంకటస్వామి, బత్తుల రంజిత్, బొడ్డు లక్ష్మణ్, ఏ. రాజేశ్వర్, డాక్టర్ దామోదర రాములు, జి. రమేష్, గిరిధరి జంగ్మే, న్యాయవాది దేవిదాస్ హాసిడే, పురుషోత్తం, ధర్మాజీ చందనే, రాష్ట్ర శాఖ ప్రతినిధులు, వివిధ మండలాలు, గ్రామాల నుంచి వచ్చిన సభ్యులు పాల్గొన్నారు.

## జీవో 97ను రద్దు చేయండి లేదంటే పోరాటమే!..
## ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆగ్రహం



**చట్టం, కరీంనగర్:** పాలిటెక్నిక్ విద్యను బలిపెట్టే కుట్రలు చేయద్దని, పేద విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడవద్దని మాజీ మంత్రి ఎమ్మెల్యే గంగుల కమలాకర్ హితవు పలికారు. జీవో నంబర్ 97ను వెంటనే రద్దు చేయాలని, లేదంటే విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పూర్వపు పాలిటెక్నిక్ విద్యా విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో కరీంనగర్ జిల్లా కేంద్రంలోని బీఆర్ అంబేదర్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ముఖాముఖి నిర్వహించగా.. విద్యార్థినులు తమ గోడు వెల్లబోసుకున్నారు. పాలిటెక్నిక్ విద్యా విధానాన్ని మారిస్తే భవిష్యత్తులో తాము ఈసెట్ రాసే అవకాశం కోల్పోతామని, పేద, మధ్య తరగతి విద్యార్థులు ఇంజినీరింగ్ విద్యకు దూరమవుతారని వాపోయారు.జీవో 97తో తమ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేయగా, అండగా ఉంటానని ఎమ్మెల్యే గంగుల భరోసానిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా, విద్యార్థులు, అధ్యాపకులు, విద్యా నిపుణులతో సంప్రదింపులు జరపకుండా, కనీసం అసెంబ్లీలో చర్చ కూడా చేయకుండా ఇలాంటి కీలకమైన నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. తాను స్వయంగా ఇంజినీరింగ్ విద్యను అభ్యసించానని గుర్తు చేసిన గంగుల.. పాలిటెక్నిక్ పూర్తి చేసి నేరుగా ఇంజినీరింగ్ రెండో సంవత్సరంలో ప్రవేశం పొందే విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంలో మంచి నైపుణ్యాన్ని కలిగి ఉంటారని తెలిపారు. అలాంటి విద్యా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం.. దానికి భిన్నంగా వ్యవహరించడం ఆందోళన కలిగిస్తోందన్నారు. పాలిటెక్నిక్ కళాశాలల భూములను ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నంలో భాగంగానే ప్రభుత్వం ఇలాంటి నిర్ణయం తీసుకుంటోందని ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలపై ప్రభుత్వం వివరణ ఇవ్వాల్సి ఉందన్నారు. అసెంబ్లీలో ఈ అంశాన్ని ప్రస్తావించి ప్రభుత్వాన్ని నిలదీస్తామని తెలిపారు. జీవో 97 రద్దు చేసే వరకు విద్యార్థుల పక్షాన పోరాడుతామని స్పష్టం చేశారు. పాలిటెక్నిక్ విద్యా విధానంపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యార్థినులతో కలిసి జీవో 97ను రద్దు చేయాలని నినదిస్తూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్, శాతవాహన యూనివర్సిటీ బీఆర్ఎస్వీ ఇన్‌చార్జి చుక శ్రీనివాస్, నాయకులు గంగాధర చందు, మొగిలోజు వెంకట్, పలువురు బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తరలిపోతున్న జలం.. ఒడిసి పట్టేదెలా!

**చట్టం, జహీరాబాద్:** పెద్దవాగుపై ఎత్తిపోతల ప్రాజెక్టును నిర్మించి కర్ణాటకకు వృథాగా తరలిపోతున్న జాడీమల్కాపూర్ జలపాతం జలాలను ఒడిసిపట్టి తమకు సాగునీరు ఇవ్వాలని సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండల రైతులు కోరుతున్నారు. పర్యాటకంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. వర్షాకాలంలో జాడిమల్కాపూర్ జలపాతాన్ని చూసేందుకు పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. వారాంతపు సెలవు దొరికితే తెలంగాణ, కర్ణాటక ప్రాంతాలకు చెందిన సందర్శకులు ఎక్కువగా వస్తున్నారు. ఈ నేపథ్యంలో పర్యాటకంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనే డిమాండ్లు ఉన్నాయి.

**తరలిపోతున్న జలం.. ఒడిసి పట్టేదెలా!**

జహీరాబాద్, ఆగస్టు 23: పెద్దవాగుపై ఎత్తిపోతల ప్రాజెక్టును నిర్మించి కర్ణాటకకు వృథాగా తరలిపోతున్న జాడీమల్కాపూర్ జలపాతం జలాలను ఒడిసిపట్టి తమకు సాగునీరు ఇవ్వాలని సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండల రైతులు కోరుతున్నారు. పర్యాటకంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. వర్షాకాలంలో జాడిమల్కాపూర్ జలపాతాన్ని చూసేందుకు పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. వారాంతపు సెలవు దొరికితే తెలంగాణ, కర్ణాటక ప్రాంతాలకు చెందిన సందర్శకులు ఎక్కువగా వస్తున్నారు. ఈ నేపథ్యంలో పర్యాటకంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

# బాలికలపై ఫోక్సో నేరం జరిగితే...
# ఈ-బాక్స్‌లో ఫిర్యాదు చేయవచ్చు




- పోలీస్ స్టేషన్ వెళ్లకుండానే యాప్ ద్వారా ఈ ఫిర్యాదు
- మొబైల్ లేదా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసే అవకాశం
- ఫోక్సో చట్టం కఠినం... అవగాహన మాత్రం శూన్యం
- చట్టం న్యూస్ ప్రత్యేక ఇంటర్వ్యూలో
- పోక్సో చట్టంపై సీనియర్ న్యాయవాది శిల్పా శర్మ అవగాహన

**చట్టం రామకృష్ణాపూర్ (మంచిర్యాల):**

బాలికలు, చిన్నారులపై లైంగిక నేరాలను అరికట్టేందుకు కఠిన చట్టాలు ఉన్నప్పటికీ.. అవగాహన లేమి భయం, సామాజిక ఒత్తిడి కారణంగా చాలామంది బాధితులు ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావడం లేదని, చిన్నారులపై జరిగే లైంగిక నేరాల విషయంలో ఫిర్యాదు చేయకుండా మౌనం వహించాల్సిన అవసరం లేదని "పోక్సో చట్టం", పోక్సో ఈబాక్స్‌పై తల్లిదండ్రులు, విద్యార్థులు, ప్రజలు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని, మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన సీనియర్ న్యాయవాది శిల్పా శర్మ ఆదివారం చట్టం న్యూస్ ప్రత్యేక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. బాలికల రక్షణ కోసం అమల్లో ఉన్న **లైంగిక నేరాల నుంచి బాలికల రక్షణ చట్టం-2012 (POCSO Act)**పై ముఖ్యంగా తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మరి ముఖ్యంగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లేందుకు సంకోచించే పరిస్థితుల్లో NCPCR ఆధ్వర్యంలోని POCSO eBox ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసే అవకాశం ఉందని వివరించారు.

**పోక్సో పరిధిలోకి ఎవరు వస్తారు...?**

18 సంవత్సరాల లోపు బాలబాలికలను చట్టపరంగా 'చైల్డ్'గా పరిగణిస్తారని, వారిపై జరిగే లైంగిక దాడులు, లైంగిక వేధింపులు, లైంగిక దోపిడీ తదితర నేరాలకు పోక్సో చట్టంలోని నిబంధనలు వర్తిస్తాయని శిల్పా శర్మ తెలిపారు. బాలుడైనా.. బాలికైనా.. నేరానికి గురైన చిన్నారికి చట్టపరమైన రక్షణ కల్పించడమే ఈ చట్టం ప్రధాన ఉద్దేశమన్నారు.

**పోలీస్‌స్టేషన్‌కు వెళ్లలేని పరిస్థితుల్లో...**

బాధిత బాలిక, తల్లిదండ్రులు లేదా సంరక్షకులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లడానికి భయపడటం, ఘటనను బయటకు చెప్పడానికి సంకోచించడం వంటి పరిస్థితులు ఎదురైనప్పుడు ఆన్‌లైన్ ఫిర్యాదు వ్యవస్థ ఉపయోగపడుతుందని ఆమె పేర్కొన్నారు. POCSO eBoxను NCPCR బాలలపై లైంగిక నేరాల ఫిర్యాదులను నేరుగా స్వీకరించేందుకు అదనపు మార్గంగా నిర్వహిస్తోంది.

**చట్టం ఉంది.. చైతన్యం లేదు...**
**బాలికల రక్షణపై ప్రచారం ఏది...?**

నేరాల నియంత్రణకు చట్టంతో పాటు అవగాహన అవసరం, బాలికలపై లైంగిక నేరాలను అరికట్టేందుకు పోక్సో చట్టం-2012 వంటి కఠినమైన చట్టాలు అమల్లో ఉన్నప్పటికీ.. వాటిపై క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించడంలో సంబంధిత అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చట్టం ఉనికిలో ఉండటం ఒక్కటే సరిపోదని.. దాని పరిధి, బాధితుల హక్కులు, ఫిర్యాదు విధానం, అందుబాటులో ఉన్న రక్షణ వ్యవస్థలపై బాలికల, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉందని సీనియర్ న్యాయవాది శిల్పా శర్మ పేర్కొన్నారు. 18 ఏళ్లలోపు బాలికలపై జరిగే లైంగిక దాడులు, లైంగిక వేధింపులు, లైంగిక దోపిడీ తదితర నేరాల నుంచి రక్షణ కల్పించేందుకు పోక్సో చట్టం ప్రత్యేక న్యాయపరమైన రక్షణను కల్పిస్తుందని ఆమె వివరించారు. నేరం జరిగిన తర్వాత స్పందించడం కంటే.. నేరం జరగకుండా ముందస్తు అవగాహన కల్పించడం మరింత కీలకమన్నారు.

**చట్టం తెలియక.. ఫిర్యాదుకు వెనుకడుగు...**

బాలికలపై నేరం జరిగిన సందర్భాల్లో బాధితులు, వారి కుటుంబ సభ్యులు భయం, సామాజిక ఒత్తిడి, పరువు ప్రతిష్ఠలపై ఆందోళన తదితర కారణాలతో పోలీసులను ఆశ్రయించేందుకు వెనుకాడుతున్నారని ఆమె తెలిపారు. ఫలితంగా అనేక ఘటనలు వెలుగులోకి రాకుండానే మరుగునపడే ప్రమాదం ఉందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో POCSO eBox వంటి ఆన్‌లైన్ ఫిర్యాదు వ్యవస్థలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లేందుకు ఇబ్బంది ఉన్న సందర్భాల్లో NCPCR అందుబాటులో ఉంచిన eBox ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసే అవకాశం ఉందని వివరించారు. బాలికలపై లైంగిక నేరాలకు సంబంధించిన వ్యవహారాల్లో బాధితుల గుర్తింపు, వ్యక్తిగత వివరాల గోప్యత అత్యంత కీలకమని ఆమె పేర్కొన్నారు. బాధిత చిన్నారిని నిందించడం లేదా ఘటనను దాచిపెట్టడం కాకుండా.. వారికి భరోసా కల్పించి చట్టపరమైన రక్షణ అందేలా చూడాల్సిన బాధ్యత కుటుంబంతో పాటు సమాజంపైనా ఉందన్నారు.

**అధికారులపై బాధ్యత లేదా...?**

పోక్సో చట్టంపై పాఠశాలలు, కళాశాలలు, గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల్లో నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉన్నప్పటికీ...అవి క్షేత్రస్థాయిలో ఆశించిన స్థాయిలో కనిపించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కేవలం ఘటన జరిగినప్పుడు స్పందించడం కాకుండా బాలికల రక్షణ చట్టాలు, ఫిర్యాదు విధానాలు, హెల్ప్ వ్యవస్థలు, బాధితుల హక్కులపై ముందస్తు చైతన్యం కల్పించడంపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని శిల్పా శర్మ సూచించారు.

**చట్టం కఠినంగా ఉండాలి..**
**అవగాహన అంతకంటే విస్తృతంగా ఉండాలి...**

బాలికల రక్షణ అనేది ఒక్క శాఖకు పరిమితమైన బాధ్యత కాదని.. పోలీస్, స్త్రీ-శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ, న్యాయసేవా సంస్థలు, పాఠశాలల యాజమాన్యాలు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. "పోక్సో చట్టం గురించి బాలికలకు తెలియకపోతే.. వారికి కల్పించిన రక్షణ హక్కులు కాగితాలకే పరిమితమవుతాయి. నేరాన్ని అరికట్టడంలో చట్టం ఎంత ముఖ్యమో.. ఆ చట్టంపై అవగాహన కల్పించడం కూడా అంతే ముఖ్యం" అని సీనియర్ న్యాయవాది శిల్పా శర్మ స్పష్టం చేశారు. బాలికల రక్షణపై అవగాహన కార్యక్రమాలు కాగితాలకే పరిమితం కాకుండా ప్రతి పాఠశాల, ప్రతి గ్రామం, ప్రతి కుటుంబానికి చేరేలా అధికారులు కార్యాచరణ చేపట్టాల్సిన అవసరం ఉందనే డిమాండ్ వినిపిస్తోంది.

## ఈబాక్స్‌లో ఫిర్యాదు ఎలా చేయాలి?

**1. NCPCR వెబ్‌సైట్‌లోకి వెళ్లాలి:**
మొబైల్ ఫోన్‌లో NCPCR అధికారిక వెబ్‌సైట్‌ను తెరిచి POCSO eBoxను ఎంచుకోవాలి. ప్రస్తుతం NCPCR అధికారిక వెబ్‌సైట్‌లో POCSO eBoxకు ప్రత్యేక విభాగం అందుబాటులో ఉంది.

**2. 'POCSO e-Box'ను ప్రారంభించాలి:**
eBoxలోకి ప్రవేశించిన తర్వాత ఫిర్యాదు నమోదు ప్రక్రియ ప్రారంభమవుతుంది. ముందుగా తమకు ఎదురైన ఘటనకు సంబంధించిన కేటగిరీని ఎంచుకోవాల్సి ఉంటుంది.

**3. ఘటన రకాన్ని ఎంపిక చేయాలి:**
అధికారిక eBoxలో ఆటస్థలం/దుకాణం/రోడ్డు, పాఠశాల/ట్యూషన్, బ్లాక్‌మెయిల్, పాఠశాల బస్సు/వ్యాన్, కుటుంబ సభ్యులు/బంధువులు/ఇతరులు, ఇంటర్నెట్/ఫోన్, ఇతర వంటి ఎంపికలు ఉన్నాయి. తమకు జరిగిన ఘటనకు సరిపోయే అంశాన్ని ఎంచుకోవాలి.

**4. వ్యక్తిగత వివరాలు నమోదు చేయాలి:**
తదుపరి దశలో eBox కోరిన వ్యక్తిగత సమాచారాన్ని నమోదు చేయాలి. అనంతరం జరిగిన ఘటనకు సంబంధించిన వివరాలను సంక్షిప్తంగా, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా నమోదు చేయాలి.

**5. వివరాలను పరిశీలించాలి:**
నమోదు చేసిన వివరాలను మరోసారి జాగ్రత్తగా పరిశీలించి, తప్పులు లేకుండా ఉన్నాయో నిర్ధారించుకోవాలి.

**6. "సబ్మిట్" నొక్కాలి:**
అన్ని వివరాలు సరిగ్గా ఉన్నాయని నిర్ధారించుకున్న తర్వాత "సబ్మిట్" బటన్‌ను నొక్కితే ఫిర్యాదు నమోదు ప్రక్రియ పూర్తవుతుంది. NCPCR వివరాల ప్రకారం, ఫిర్యాదు విజయవంతంగా నమోదైన అనంతరం అంగీకార సమాచారం (Acknowledgement) కంప్లైంట్ నెంబర్ అందుతుంది. ఆ నంబర్‌ను భద్రపరుచుకోవడం మంచిదని తాను సూచించారు.

**ఫిర్యాదు చేసిన తర్వాత ఏం జరుగుతుంది...?**
POCSO eBox ద్వారా అందిన ఫిర్యాదులను NCPCR పరిశీలించి సంబంధిత రాష్ట్ర/కేంద్రపాలిత ప్రాంత అధికారుల నుంచి నివేదికలు కోరుతూ తదుపరి చర్యలకు పంపే విధానం ఉందని కమిషన్ వార్షిక నివేదిక పేర్కొంటోంది.




అయితే POCSO eBox అనేది ఫిర్యాదు చేయడానికి ఒక అదనపు ఆన్‌లైన్ మార్గం మాత్రమేనని ఆమె తెలిపారు. బాలిక భద్రతకు తక్షణ ప్రమాదం ఉన్న అత్యవసర పరిస్థితుల్లో ఆలస్యం చేయకుండా సంబంధిత పోలీసు అధికారులను సంప్రదించడం అవసరమని సూచించారు.

**గోప్యత.. అత్యంత కీలకం..**
బాలికలపై లైంగిక నేరాలకు సంబంధించిన వ్యవహారాల్లో బాధిత బాలిక వ్యక్తిగత వివరాల గోప్యత అత్యంత కీలకమని ఆమె పేర్కొన్నారు. నేరానికి గురైన చిన్నారిని నిందించడం, ఘటనను దాచిపెట్టడం కాకుండా.. వారికి భరోసా కల్పించి చట్టపరమైన రక్షణ వ్యవస్థలను ఆశ్రయించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ముందుకు రావాలని సూచించారు.
బాలికలపై నేరాన్ని దాచడం కాదు.. చట్టం దృష్టికి తీసుకురావడమే మన బాధ్యతఅని అన్నారు. భయపడకుండా ఫిర్యాదు చేయడానికి POCSO eBox వంటి వ్యవస్థలను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ న్యాయవాది శిల్పా శర్మ సూచించారు.

## డీసీసీ నూతన అధ్యక్షుడి ఎంపికకు ‘సంఘటన్ సృజన్ అభియాన్’

**రాజేంద్రనగర్, చట్టం:**

రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) నూతన అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియలో భాగంగా ఏఐసీసీ సూచనల మేరకు ‘సంఘటన్ సృజన్ అభియాన్’ (ఎస్ఎస్ఏ) కార్యక్రమం ద్వారా క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను సేకరిస్తున్నట్లు కర్ణాటక ఎమ్మెల్సీ, ఏఐసీసీ కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా అబ్జర్వర్ పి.వి. మోహన్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో శంషాబాద్ మండలం తొండుపల్లి గ్రామంలోని మనస్వి గార్డెన్స్‌లో రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సంస్థాగత సంప్రదింపుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పి.వి. మోహన్ మాట్లాడుతూ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఆలోచనలు, మార్గదర్శకత్వంలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడమే సంఘటన్ సృజన్ అభియాన్ ప్రధాన లక్ష్యమన్నారు. రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణతో పాటు అన్ని వర్గాలను కలుపుకుని ముందుకు సాగడమే కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతమని పేర్కొన్నారు. బూత్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీని మరింత పటిష్ఠం చేసి, ప్రజలకు చేరువైన బలమైన సంస్థాగత నిర్మాణాన్ని ఏర్పాటు చేయడమే లక్ష్యమన్నారు. డీసీసీ నూతన అధ్యక్షుడి ఎంపికలో క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలకు పూర్తి ప్రాధాన్యత ఇస్తామని పి.వి. మోహన్ తెలిపారు. పార్టీని సమర్థవంతంగా ముందుకు నడిపించడంతో పాటు అందరినీ కలుపుకుని పనిచేసే నాయకత్వాన్ని పారదర్శక విధానంలో ఎంపిక చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ అబ్జర్వర్లు, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఇ.వి. శ్రీనివాస్ రావు పాల్గొన్నారు. డీసీసీ అధ్యక్ష పదవి కోసం పోటీలో ఉన్న అభ్యర్థులు సమావేశానికి హాజరై తమ అభిప్రాయాలను, పార్టీ అభివృద్ధికి సంబంధించిన సూచనలను తెలియజేశారు. రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులతో పాటు జిల్లా ఉపాధ్యక్షులు, జిల్లా కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేశారు.




## సెంటెన్స్ స్కూల్‌లో వైభవంగా 'కపుల్స్ డే' వేడుకలు



**మునగాల (చట్టం):** తాడువాయి గ్రామంలోని సెంటెన్స్ స్కూల్‌లో కపుల్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులకు ప్రత్యేక ఆటల పోటీలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ రోషిని డిషోజా మాట్లాడుతూ.. దంపతులు ఎలాంటి మానసిక ఒత్తిళ్లకు లోనుకాకుండా ఆహ్లాదకరమైన, ప్రశాంతమైన, వినోదాత్మకమైన జీవితాన్ని గడపాలని పిలుపునిచ్చారు. అనంతరం పోటీల్లో ప్రతిభ కనబరిచి గెలుపొందిన జంటలకు బహుమతులు అందజేశారు. ఈ వేడుకల్లో పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మేరీ, సిస్టర్ రోజీ, సిస్టర్ మానస, ఉపాధ్యాయ బృందం, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలు,మతోన్మాదం పై యువత ఉద్యమించాలి

**నల్లు సుధాకర్ రెడ్డి ఏఐవైఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు.**

(**చట్టం**) మాదకద్రవ్యాలు,మతోన్మాదానికి వ్యతిరేంగా యువత సమరశీల ఉద్యమాలు చేయాలని ఏఐవైఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు నల్లు సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు కొరవి మండల కేంద్రంలో అఖిల భారత యువజన సమాఖ్య మండల 9వ మహాసభల సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జలగం ప్రవీణ్ పతాకావిష్కరణ చేయగా,బొడ్డు ఉదయ్ అధ్యక్షతన జరిగిన సభలో సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడంలో పాలకవర్గాలు పూర్తిగా వైఫల్యం చెందాయని యువతలో ప్రశ్నించే తత్వాన్ని చంపడం కోసం కుల మత వర్గ వైశ్యామ్యాలను రెచ్చగొడుతూ, బోగస "దేశభక్తి ముసుగులో, భక్తి, మూఢనమ్మకాలు, మాదకద్రవ్యాల వైపు యువతను నెట్టే విధంగా గత 12 ఏళ్లుగా బిజెపి ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని, ఈ నేపథ్యంలో యువత ఉపాధి అవకాశాల కోసం, నిజమైన దేశభక్తిని ప్రకటిస్తూనే, ప్రగతిశీల భావాల వైపు సమీకరించే విధంగా ఏఐవైఎఫ్ పనిచేయాలని కోరారు. నూతన మండల కమిటీ అధ్యక్షుడు సంగెం జెన్ని, ప్రధాన కార్యదర్శి బొల్లు సాయి, ఆఫీస్ బేరర్స్ గా బొడ్డు ఉదయ్, కావటి గణేష్, బుర్ర ఉదయ్, బొల్లం అనిల్, దండ్రు వేణు, రేపాకుల ప్రశాంత్, దైద బాలు లను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో నాయకులు తురక రమేష్, కామెళ్ళ చరణ్, జక్కుల గణేష్,రాజేష్, అరుణ్ కుమార్, సంజయ్ సుమంత్, నందు, జెస్సు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by SIRIGADA PRASAD and Printed at INDUR OFFSET PRINTERS, Opposite Cheer Hanuman Temple, Weekly Bazar, Nizamabad District,Telangana 503001., and Published at: H.No. 3-3-486/2, Gayathrinagar, Varni road, Nizamabad District, Telangana - 503001.,Editor: SIRIGADA PRASAD. RNI.No. TELTEL/2010/32350. Cell ;9948884497. prasadsirigada27@gmail.com